


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి మంగళవారం 29 మార్చి 2022 సంపుటి : 03 సంచిక : 198 పేజీలు : 4 వెల : రూ 3-00


# సీఎం జగన్ కీలక నిర్ణయం..

### బ్యారేజీకి గౌతమ్ రెడ్డి పేరు



నెల్లూరు గౌతమ్ మన మధ్య లేడనే వార్త చాలా కష్టంగా ఉంది. తాను ఇక లేడు అనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్లో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. గౌతమ్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.సీఎం మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి గౌతమ్ నాకు మంచి స్నేహితుడు. ప్రతీ అడుగులో నాకు తోడుగా ఉన్నాడు. గౌతమ్ రెడ్డితో ఉన్న సాన్నిహిత్యం చెప్పలేనిది. రాజకీయాల్లోని తనను నేను తీసుకువచ్చాను. రాజకీయాల్లో ఇద్దరం మంచి స్నేహితులుగా ఉన్నాం. వైఎస్ఆర్సీపీ పార్టీ గౌతమ్ రెడ్డి కుటుంబానికి తోడుగా ఉంది. గౌతమ్ రెడ్డి ఏపీ మంత్రి వర్గంలో పరిశ్రమల శాఖ సహా ఆరు శాఖలను నిర్వహించారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు ఆయన చివరి క్షణం వరకు కృషి చేశారు. గౌతమ్ రెడ్డి ప్రతీ అంశంలోనూ నన్ను ప్రోత్సహించారు. మే 15 వరకు సంగం బ్యారేజీని పూర్తి చేసి.. గౌతమ్ రెడ్డి గౌరవార్థం ఆ బ్యారేజీకి ఆయన పేరును పెడతామని ప్రకటించారు. రాజకీయాల్లోకి తనను నేనే తీసుకురావడం జరిగింది. రా గౌతమ్ అని చెప్పి తనను రాజకీయాల్లోకి తీసుకుని వచ్చి... నేను అడుగులు వేస్తేనే తను అడుగులు వేశాడు. ఆ తర్వాత ఒక మంచి రాజకీయనాయకుడిగా కూడా తాను ఎదిగాడు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి... ఆ తర్వాత మంత్రిపదవి చేపట్టిన తర్వాత ఒక మంచి మంత్రిగా కొనసాగాడు. పరిశ్రమలు, ఐటీ, స్కిల్ డెవలప్మెంట్తో పాటు దాదాపు ఆరుశాఖలు నిర్వహించాడని గుర్తు చేసుకున్నారు.. ప్రతి సందర్భంలోనూ పరిశ్రమలు ఇక్కడికి తీసుకుని రావాలి... ఇక్కడికి తీసుకుని వస్తే... రాష్ట్ర ప్రభుత్వానికి, నాకు వ్యక్తిగతంగా మంచి పేరు వస్తుందని ఎప్పుడూ తాపత్రయపడేవాడు. అందులో భాగంగానే బహుశా చివరి క్షణాల్లో దుబాయ్ వెళ్లాడు. వెళ్లేముందు నాకు కనిపించాడు. దుబాయ్కు వెళ్లి వచ్చిన తర్వాత అక్కడ జరిగిన పరిణామాల మీద నన్ను కలవాలని టైం కూడా అడిగాడు. అంతలోపే ఈ సంఘటన జరిగింది. ప్రతి సందర్భంలోనూ ఒక మంచి మంత్రిగా, మంచి ఎమ్మెల్యేగా, ఒక మంచి స్నేహితుడిగా అన్నిరకాలుగా ఒక మంచి వ్యక్తిని కోల్పోయామని అని చెప్పి... జీర్ణించుకోవడం కష్టంగా ఉందని సీఎం అన్నారు.

# మనసుకి కష్టంగా ఉంది..



నెల్లూరు: గౌతమ్ మన మధ్య లేడనే విషయం నమ్మడానికి మనసుకి కష్టంగా ఉందని, ఎంత చెప్పినా ఆయన లేని లోటు తీరనిదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

### గౌతమ్‌రెడ్డి సంస్మరణ సభలో సీఎం వైఎస్ జగన్ భావోద్వేగం

అన్నారు. నెల్లూరు వీపీఆర్ కన్వెన్షన్ హాలులో సోమవారం జరిగిన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంస్మరణ సభలో పాల్గొన్న సీఎం జగన్.. గౌతమ్ చిత్రపటానికి నివాళి అర్పించి అనంతరం ప్రసంగించారు. గౌతమ్‌రెడ్డి లాంటి మంచి వ్యక్తిని కోల్పోవడం బాధాకరం అని, ప్రతీ అడుగులో గౌతం తనకు తోడుగా ఉండేవాడని సీఎం జగన్ అన్నారు. రాజమోహన్ గారికంటే గౌతమ్ ఆత్మీయత తనకు ఎక్కువగా అనిపించేదని, తన ప్రోత్సాహంతోనే గౌతమ్ రాజకీయాల్లోకి వచ్చారని సీఎం జగన్ గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లో తనకు తోడుగా, స్నేహితుడిగా ఉండేవారన్నారు. వయసులో పెద్దవాడైనా.. ఆ గర్వం కనిపించేది కాదని, పైగా సోదర భావంతో మెలిగేవాడని గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర పెట్టుబడుల కోసం ఎంతో తాపత్రయపడ్డాడని, చివరి క్షణం వరకూ రాష్ట్ర శ్రేయస్సు కోసమే పాటుపడ్డారని చెప్పారు. ఆ కుటుంబానికి తానే కాదు.. వైఎస్సార్‌సీపీ మొత్తం తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు సీఎం జగన్.

## 'స్వామి వారిని దర్శించుకోవడం అనుభూతి కలిగించింది'

విశాఖ: ప్రత్యేక విమానంలో గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ విశాఖ పర్యటనకు బయల్దేరి వెళ్లారు. సోమవారం ఉదయం విజయవాడ నుంచి విశాఖ పర్యటనకు వెళ్లారు. దీనిలో భాగంగా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న బిశ్వభూషణ్‌కు ఘనస్వాగతం లభించింది.ఎయిర్‌పోర్ట్ నుంచి కాన్వాయ్‌లో నేరుగా సింహాచలం సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయానికి గవర్నర్ దంపతులు చేరుకున్నారు.ఈ మేరకు మాట్లాడిన ఆయన..సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. సింహాద్రి అప్పన్నను దర్శించుకోవడం చాలా అనుభూతి కలిగించిందని పేర్కొన్నారు.

## అన్నీ తప్పుడు ఆరోపణలే.. అవన్నీ నిజాలే.. బుగ్గన వర్సెస్ యనమల

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అధికార, విపక్ష నేతల మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు మధ్య ఇప్పుడు మాటల యుద్ధం నడుస్తోంది. ఏపీ ఆర్థిక పరిస్థితిపై యనమల అవాస్తవమైన, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆర్థిక మంత్రి బుగ్గన ఫైర్ అయ్యారు. ప్రభుత్వ పెద్దల చేతుల్లోకి 48 వేల కోట్ల రూపాయలు వెళ్లాయంటూ టీడీపీ నేత యనమల ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను మంత్రి బుగ్గన ఖండించారు. అది వాస్తవిక వ్యయం కాదని, ఆ మొత్తం కూడా ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి బుక్ అడ్జస్ట్‌మెంట్ ట్రాన్సాక్షన్ అనే విషయాన్ని గ్రహించాలని మంత్రి కౌంటర్ ఇచ్చారు.సీఎఫ్ఎంఎస్‌లో స్పెషల్ బిల్లులంటూ ఏవీ ఉండవని మంత్రి స్పష్టం చేశారు. బిల్లుల చెల్లింపులకు బీఎల్ఎం మాడ్యూల్ పొందుపర్చామని, ట్రెజరీ కోడ్ ప్రకారమే బిల్లుల చెల్లింపు వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. సీఎఫ్ఎంఎస్ రిపోర్టింగ్ విధానంలో 'బుక్ అడ్జస్ట్‌మెంట్



ట్రాన్సాక్షన్స్'ను గుర్తించడం కోసం స్పెషల్ బిల్లులు అనే పేరు పెట్టారని, అంతేకానీ స్పెషల్ బిల్లుల హెడ్ అనేది ఎక్కడా లేదని మంత్రి ఓ క్లారిటీ ఇచ్చారు. సీ ఎఫ్ ఎం ఎస్ ను క్రమపద్ధతిలో వ్యవస్థీకృతం చేయలేదు. అందుకే బుక్ అడ్జస్ట్‌మెంట్ ట్రాన్సాక్షన్లు స్పెషల్ బిల్లుల కింద చూపారని వివరించారు. ఇదంతా వివరిస్తూ ఆర్థిక శాఖ కార్యదర్శి కాగ్‌కు ఓ లేఖ కూడా రాశారని వెల్లడించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎలాంటి నగదు లావాదేవీలు జరగలేదని, అలాంటప్పుడు అవినీతి అంటూ ఎలా విమర్శలు చేస్తారని మంత్రి బుగ్గన సూటిగా ప్రశ్నించారు.

లొసుగులు బయటపడ్డాయనే తమపై విమర్శలు : యనమల రామకృష్ణుడు

కాగ్ సూచించిన నోటీసుల ఆధారంగానే తాను ప్రభుత్వంపై ఆరోపణలు చేశానని టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా తాను ఆరోపణలు చేయనని, తనకు ఆ అలవాటు కూడా లేదని ప్రకటించారు. లొసుగులు బయటపడటంతో దిక్కు తోచక ప్రభుత్వం తనపై రివర్స్ ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. సీఎఫ్ఎంఎస్‌ను బైపాస్ చేసి, బ్యాక్‌ఎండ్ లావాదేవీలను ఎలా అనుమతిస్తారంటూ యనమల సూటిగా ప్రశ్నించారు. ప్రత్యేక బిల్లుల పేరుతో 48 వేల కోట్లకు పైగా నిధులను విడుదల చేయడం అంటే ట్రెజరీ కోడ్ ఉల్లంఘనే అవుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ఆర్థిక మంత్రికి యనమల 12 ప్రశ్నలను సంధించారు. ఏపీ ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగోలేదని, వెంటనే ఫైనాన్షియల్ ఎమర్జెన్సీని ప్రకటించాలని యనమల డిమాండ్ చేశారు.

## అన్నమయ్య ప్రాజెక్ట్ నిరాశ్రయులను ఆదుకోవడంపై హైకోర్టులో విచారణ

అమరావతి: అన్నమయ్య ప్రాజెక్ట్ నిరాశ్రయులను ఆదుకోవడంపై ఏపీ హైకోర్టులో విచారణ చేపట్టింది. ఇందుకు సంబంధించి రమేష్ నాయుడు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది గోపాలకృష్ణ వాదనలు వినిపించారు.




నిరాశ్రయులకు తక్కువ పరిహారం ఇచ్చారని పిటిషనర్ తెలిపారు. లక్షా 80 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని వాదనలు వినిపించారు. ఎంత మంది నిరాశ్రయులు ఉన్నారో.. నివేదిక ఇవ్వాలని పిటిషనర్‌ను ధర్మాసనం అడిగింది. నష్టపరిహారం చెల్లిస్తున్నామని ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది.

## ఏపీ ఆర్థిక పరిస్థితిపై విచారణ జరిపించాలంటూ మోదీకి లేఖ రాసిన రఘురామ



ఏపీలోని కాగ్ లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణ రాజు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ప్రధాన మంత్రి మోదీకి లేఖ రాశారు. ఏపీ ఆర్థిక పరిస్థితిపై కాగ్ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొని, సీబీఐ ఆర్థిక నేర విభాగంతో లేదా సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్‌తో విచారణ జరిపించాలని రఘురామ ఆ లేఖలో ప్రధానిని కోరారు. వివిధ అవసరాల నిమిత్తం ఏపీ ప్రభుత్వం అప్పులు తీసుకుందని, ఈ సమయంలో రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. బ్యాంకులు, వివిధ కార్పొరేషన్ల నుంచి జగన్ సర్కార్ ఎలా సేకరించిందో అన్న విచారణ కూడా జరపాలని నర్సాపురం ఎంపీ రఘురామ ఆ లేఖలో ప్రధాని మోదీని కోరారు.

సంచలనం రేపుతున్న కాగ్ నివేదిక

ఏపీ ఆర్థిక పరిస్థితిపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఓ నివేదిక ప్రకటించింది. కోడ్‌కు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం చెల్లింపులు చేసిందని కాగ్ తన నివేదికలో పేర్కొంది. అంతేకాకుండా 48 వేల కోట్లకు సంబంధించిన రికార్డులు కూడా సరిగ్గా లేవని ప్రభుత్వాన్ని తప్పుబట్టింది. అంతేకాకుండా 2020-2021 ఆర్థిక సంవత్సరానికి గాను లక్ష కోట్ల రూపాయలకు పైగా అసెంబ్లీకి చెప్పకుండానే ఖర్చు చేశారని కూడా పేర్కొంది. చట్ట సభలకు చెప్పకుండా ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేయడమంటే రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని కాగ్ మండిపడింది.

## బన్సీలాల్‌పేట్ కోనేరు బావిపై మోదీ ప్రశంసలు


### వాననీటి సంరక్షణ పట్ల ప్రధాని అభినందనలు
### ఆగస్టు 15 నాటికి పూర్తిస్థాయిలో పునరుద్ధరణ

హైదరాబాద్/బన్సీలాల్‌పేట: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్‌లోని పురాతన బావి పునరుద్ధరణపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. నిజాం కాలం నాటి ఈ బావికి పూర్వవైభవాన్ని తెచ్చారని ఆయన కొనియాడారు. నీటిసంరక్షణ, భూగర్భ జలాలను కాపాడుకొనేందుకు స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు చేస్తున్న కృషిని ప్రధాని అభినందించారు. ఆదివారం మన్ కీ బాత్‌లో బన్సీలాల్‌పేట్‌లోని బావి గురించి ఆయన ప్రస్తావించారు. చెత్తా చెదారం, మట్టితో నిండిన ఈ బావిని వాననీటి సంరక్షణ కేంద్రంగా అభివృద్ధి చేయడం సంతోషదాయకమన్నారు. సుమారు 1830 కాలానికి చెందిన బన్సీలాల్‌పేట్ బావి అద్భుతమైన శిల్పకళా సంపదను కలిగి ఉంది. బావి ప్రవేశ ద్వారం ఆర్చ్‌లాగా ఉంటుంది. చుట్టూ ఏర్పాటు చేసిన రాతి కట్టడం, సింహాలు, పాములు, గుర్రాల బొమ్మలు అలనాటి కళాత్మకతను సమున్నతంగా ఆవిష్కరిస్తాయి. 35 మీటర్ల వెడల్పు 53 అడుగుల లోతు ఉన్న ఈ బావి చాలా కాలం వరకు ఉనికిని చాటుకుంది. 40 ఏళ్ల క్రితం




దీనిని పూర్తిగా మూసివేశారు. మట్టి, చెత్తా చెదారంతో నిండిపోయింది. వాహనాలకు పార్కింగ్ అడ్డాగా మారింది. వాననీటి సంరక్షణ కోసం ఉద్యమాన్ని చేపట్టిన 'ది రెయిన్ వాటర్ ప్రాజెక్టు' సంస్థ జీహెచ్ఎంసీ సహకారంతో బావి పునరుద్ధరణకు నడుం కట్టింది. చెత్తా చెదారం తొలగించారు. సుమారు 2 వేల టన్నుల మట్టిని సైతం తొలగించి బావికి పూర్వ ఆకృతిని తెచ్చారు. ప్రస్తుతం ఈ బావి నీటితో తళతళలాడుతోంది. దీని చుట్టూ ఏర్పాటు చేసిన రాతి కట్టడాలు, కళాకృతులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ఆగస్టు నాటికి ఈ ప్రాంగణాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నట్లు 'ది రెయిన్ వాటర్ ప్రాజెక్టు' వ్యవస్థాపకులు కల్పన రమేష్ లోకనాథన్ తెలిపారు. ఇప్పటి వరకు పూడికతీత కోసం రూ.30 లక్షల వరకు ఖర్చు చేశారు. అద్భుతమైన ఆర్కిటెక్చర్‌తో బావిని కళాత్మకంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

## గోవా ముఖ్యమంత్రిగా ప్రమోద్ సావంత్ ప్రమాణస్వీకారం




పనాజీ : గోవా ముఖ్యమంత్రిగా ప్రమోద్ సావంత్ ప్రమాణస్వీకారం చేశారు. ఆ రాష్ట్ర గవర్నర్ పీఎస్ శ్రీధరన్ పిళ్లై.. ప్రమోద్ సావంత్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. గోవాలోని డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నాయకులు హాజరయ్యారు.రెండోసారి సీఎంగా ప్రమాణం చేసిన ప్రమోద్ సావంత్‌కు గవర్నర్ శ్రీధరన్, ప్రధాని మోదీతో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కేబినెట్ మంత్రులుగా విశ్వజిత్ రాణే, మౌవిన్ గోదిన్‌హో, రావి నాయక్, నైలేష్ కాబ్రల్, సుభాష్ శిరోద్కర్, రోహన్ కౌంటే, గోవింద్, గౌడే, అటాన్షియో మాన్‌సెరేట్ ప్రమాణస్వీకారం చేశారు.

## తీవ్ర నిరాశలో రైతాంగం

### సోమువీర్రాజు

నెల్లూరు రాష్ట్రంలో రైతుల పక్షాన బిజెపి నిలబడి ఉంది. నెల్లూరు జిల్లా నుండి రైతులు తరపున ఉద్యమ శంఖారావం పూరించాం. రైతుల ధాన్యం కొనడం లేదు. రైతాంగం తీవ్ర నిరాశతో వున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు అన్నారు.ధాన్యం కొనుగోలు చేసి వెంటనే డబ్బు చెల్లించాలి. మిల్లర్ల చేతిలో ప్రభుత్వం కీలుబొమ్మ. సివిల్ సప్లై అధికారులు వల్లే ఈ సమస్యలు వస్తున్నాయి. ఎఫ్ సి ఐ కొంటుంది అయితే రాష్ట్ర ప్రభుత్వం కొని రైతులు కు చెల్లింపులు చేయడం లేదు. మిల్లర్లు వల్లనే రైతులు నష్టపోతున్నారు. ధాన్యం తక్కువ కు కొని బియ్యం ఎక్కువ ధరకు అమ్ముతున్నారు.




# సంపాదకీయం

మంగళవారం 29 మార్చి 2022

## కాంగ్రెస్ వ్యూహాలు మారుతున్నాయా...

ఎన్నికల వ్యూహకర్తగా ప్రసిద్ధి చెందిన ప్రశాంత్ కిషోర్ త్వరలోనే కాంగ్రెస్ పార్టీతో జతకట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయని పొలిటిక్స్ పండితులు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం కాంగ్రెస్ కీలక నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతో విడివిడిగా, ఆ తర్వాత ఇద్దరితో కలిసి భేటీ అవడాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. అయితే.. రాహుల్, ప్రియాంకతో తన సమావేశం ఊహాగానమే తప్ప వాస్తవం కాదని ప్రశాంత్ కిషోర్ చెప్పినప్పటికీ.. పీకే భేటీ ముమ్మాటికీ నిజమే అని కాంగ్రెస్ పార్టీలో కొందరు ముఖ్య నేతలు ధ్రువీకరిస్తుండడం గమనార్హం. వచ్చే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పీకే ఎన్నికల వ్యూహాలు రచిస్తారని కూడా ఆ నేతలు చెబుతుండడం విశేషం. కాగా.. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహాలను ప్రశాంత్ కిషోర్ ఒకప్పటి సహచరుడు సునీల్ కనుగోలు చూస్తున్నారు. వచ్చే సంవత్సరం గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక, ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల శాసనసభలకు జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పనిచేసే బాధ్యతను పీకేకు అప్పగిస్తారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విస్తృత ప్రయోజనాల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ- ప్రశాంత్ కిషోర్ కలిసిన పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనే అభిప్రాయం కాంగ్రెస్ అధిష్టానంలో ఉందని తెలుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి కేంద్రంలోని బీజేపీని ఢీకొట్టే జాతీయ కూటమి ఏర్పాటు దిశగా రాహుల్, ప్రియాంక- ప్రశాంత్ కిషోర్ సమావేశాలు జరుగుతున్నాయనే ప్రచారం కూడా జరుగుతుండడం గమనార్హం. వివిధ రాష్ట్రాల్లో పార్టీని పునరుద్ధరించే బాధ్యత పీకేకి అప్పగిస్తే.. ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరే ఛాన్స్ ఉందనే చర్చ గతంలోనే జరిగింది. పీకేను పార్టీలో చేర్చుకుని ప్రధాన కార్యదర్శి పదవి అప్పగించాలనే సమాలోచనలు జరిగాయట. నిజానికి వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సెమీ ఫైనల్ గా భావించిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దారుణ ఓటమిని మూటకట్టుకుంది. ఒకప్పుడు గాంధీల కుటుంబానికి కంచుకోట, పెద్ద రాష్ట్రమైన యూపీలో మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా చతికిలపడిపోయింది. దీంతో ఎలాగైనా కాంగ్రెస్ ను బతికించుకోవాలనే వ్యూహంలో భాగంగానే అధినేత్రి సోనియా సూచన మేరకు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ప్రశాంత్ కిషోర్ తో భేటీ అయ్యారనే ఊహాగానాలు వస్తున్నాయి. నిజానికి గతంలో కాంగ్రెస్ తో కలిసి పనిచేసేందుకు ప్రశాంత్ కిషోర్ సుముఖత వ్యక్తం చేశారు. అయితే.. అప్పుడు రాహుల్ గాంధీ ససేమిరా అన్నారు. యితే.. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత ప్రశాంత్ కిషోర్ తో భేటీ అయ్యేందుకు రాహుల్ దిగివచ్చినట్లు చెబుతున్నారు. సోనియా గాంధీకి అత్యంత సమీపంగా మెలిగే రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్ మరణం తర్వాత కాంగ్రెస్ పార్టీకి అన్నింటినీ సమన్వయ పరిచి చక్కదిద్దే నాయకుడు లేడనే చెప్పాలి. ఇప్పుడు అలాంటి బాధ్యతను ప్రశాంత్ కిషోర్ కు అప్పగిస్తే మంచిదని కాంగ్రెస్ పార్టీలోని ఒక వర్గం భావిస్తోందట. వ్యూహకర్తగా బాధ్యతలు తీసుకోక ముందే క్షేత్ర స్థాయిలో పర్యటించి, అన్ని విషయాలు కూలంకషంగా అధ్యయనం చేయడం పీకే స్టైల్. ఇలాంటి శైలి కారణంగా పీకేకి కాంగ్రెస్ ఎన్నికల వ్యూహం బాధ్యతలు అప్పగిస్తే పార్టీకి మంచి జరుగుతుందనే అభిప్రాయం ఆ పార్టీలోని పలువురు నేతలు అంటున్నారట. గుజరాత్ లో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పీకే పనిచేసేందుకు రాహుల్- ప్రియాంకతో భేటీ సందర్భంగా అంగీకారం కుదిరిందని తెలుస్తోంది తాను కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేసేందుకు రాహుల్ గాంధీ నో చెప్పడంతో జాతీయ స్థాయిలో కాంగ్రెసేతర ప్రతిపక్ష పార్టీల నేతలను ఒకే తాటిపైకి తెచ్చేందుక ప్రశాంత్ కిషోర్ ముమ్మరంగా యత్నాలు చేసిన విషయం తెలిసిందే. ఆ క్రమంలోనే పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ పార్టీ తృణమూల్ కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావడంలో పీకే ప్రముఖ పాత్ర పోషించారు. బీహార్ సీఎం నితీష్ కుమార్ సహా పలు పార్టీల కీలక నేతలతో పీకే తరచుగా సమావేశాలు అవుతున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి బీజేపి ఎదుర్కొనేందుకు కూటమి ఏర్పాటు దిశగా పీకే సమావేశాలు జరుగుతున్నాయని జాతీయ రాజకీయాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే టీఆర్ఎస్ తరఫున తాను పనిచేస్తుండడంతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి పనిచేయాలనే విషయంలో పీకే కొంత డోలాయమానంలో పడ్డారని తెలుస్తోంది. తెలంగాణ సీఎం కేసీఆర్ తో కలిసి వచ్చే ఎన్నికల కోసం పీకే పనిచేస్తుండడం గమనార్హం. ఆ క్రమంలోనే ఆయన కొద్ది రోజుల క్రితం మెదక్ జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించి, పలువురు స్థానికులతో సంభాషించారు కూడా. ఒకవేళ ప్రశాంత్ కిషోర్ కాంగ్రెస్ తరఫున పనిచేయాలని డిసైడ్ అయితే.. దాని పర్యవసానాలు తెలంగాణ రాజకీయాలపై పడే అవకాశం ఉందని రాజకీయ నిపుణుల చెబుతున్నారు.

# 48 వేల కోట్ల లెక్క ఏంటీ

విజయవాడ, మార్చి 28, (న్యూస్ పల్స్) జగన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ సర్కార్ అంటే ఇప్పటి వరకు వివిధ శాఖలు మాత్రమే భయపడ్డాయనుకున్నాం. అలా భయపడిన వాటి జాబితాలో ఇప్పుడు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కూడా చోటు దక్కించుకోవడం చర్చనీయాంశంగా మారింది. వైసీపీ ప్రభుత్వం చేసిన ఖర్చులో 48 వేల కోట్ల రూపాయలకు ఒక లెక్కా లేదు.. జమా లేదు.. దీంతో ఆడిట్ సర్టిఫికేట్ ఇచ్చేందుకు కాగ్ భయంతో వణికిపోయిందట. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కాగ్ నివేదికలో ఈ విషయం స్పష్టంగా రాయడం గమనార్హం. ఇది జగన్ రెడ్డి ప్రభుత్వం అరాచకానికి పరాకాష్ట అంటున్నారు. నిజానికి కాగ్ రాజ్యాంగ ప్రతిపత్తి కలిగిన సంస్థ. అలాంటి సంస్థను కూడా జగన్ రెడ్డి సర్కార్ భయాందోళనకు గురిచేసిందంటే ఇక చెప్పేదేముంది అంటున్నారు. వైసీపీ సర్కార్ చూపించిన జమా ఖర్చుల లెక్కలు అంతుపట్టనప్పుడు ఇచ్చే క్వాలిఫైడ్ ఒపీనియన్ ను కాగ్ ఇచ్చింది. నిజానికి దేశంలోని మరే ఇతర రాష్ట్ర ప్రభుత్వంపైన కాగ్ ఇలాంటి అభిప్రాయం వ్యక్తం చేయలేదని ఆర్థికరంగ నిపుణులు చెబుతున్నారు. జమా ఖర్చులకు సంబంధించిన సమాచారం పీఏసీ అడిగినా ఇవ్వని జగన్ సర్కార్ తీరును టీడీపీ సభ్యులు ఎండగడుతున్నారు. గోల్ మాల్ అయిన 48 వేల కోట్ల నిధులపై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఒక్క అవకాశం అంటూ ఏపీ ప్రజలను వేడుకుని తీరా అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని జగన్ రెడ్డి సర్కార్ ప్రమాదంలో పడేసిందనే విమర్శలు సర్వత్రా వస్తున్న విషయం తెలిసిందే. అవగాహనా లేమితో.. గొప్పలకు పోయి కోట్లకు కోట్ల నిధులను ఖజానా సామర్థ్యానికి మించి ఖర్చు చేసేసింది. దీంతో ఖజానా ఖాళీ అయిపోయింది. తాను హామీ ఇచ్చిన నవరత్నాలు కూడా అమలు చేసే అవకాశం లేకుండా పోవడంతో.. అప్పుల కోసం అంగలార్చడం మొదలెట్టింది. సంవత్సరంలో 331 రోజులు ఆర్బీఐ నుంచి అప్పులతోనే వైసీపీ సర్కార్ బండి లాక్కొస్తోంది. అప్పుల పరిమితి కూడా దాటిపోవడంతో ఓవర్ డ్రాఫ్టులంటూ ఢిల్లీ చుట్టూ తిరిగింది. ఆనక బాండ్లనూ తాకట్టు పెట్టేసింది. అవీ చాలకపోవడంతో పలు ప్రభుత్వ శాఖల ఖాతాల్లోని నిధులను కూడా ఉన్నకాడికి ఇచ్చేయాలని ఆదేశించింది. దీంతో చివరికి ఆయా శాఖల రోజువారీ ఖర్చులకు కూడా తిప్పలు పడాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నాయి. భవిష్యత్తులో వచ్చే మద్యం ఆదాయాన్ని కూడా కుదవబెట్టేసి అప్పులు తెచ్చింది. అయినా.. కరువు తీరకపోవడంతో ఇలా రాష్ట్రానికి వచ్చిన ఆదాయం ఎంత..? దాంట్లో ఖర్చుపెట్టినది ఎంత అనేది సక్రమంగా లెక్కలు చెప్పకుండా నిధులను ఏమి చేసిందో కూడా చెప్పకుండా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంది. ఇప్పుడు కాగ్ ఈ విషయాన్ని బయటపెట్టడంతో వైసీపీ సర్కార్ బండారం బయట పడింది. ఏపీలో ఆర్థిక వ్యవస్థ అంతా అస్తవ్యస్థం అయిపోయిందంటూ కాగ్ తన నివేదికలో పేర్కొనడం గమనార్హం. లెక్కల్లో చెప్పలేనంత తికమక ఉ ందన్న కాగ్. అసెంబ్లీకి చెప్పకుండా లక్షా 9 లక్షల కోట్లను జగన్ రెడ్డి సర్కార్ ఖర్చుపెట్టినట్లు కాగ్ బయటపెట్టింది. ప్రభుత్వ చర్య ఆర్టికల్ 204(3)ని పూర్తి ఉల్లంఘనే అని పేర్కొంది. కార్పొరేషన్ల అప్పులు, వడ్డీలు చెల్లించి, బడ్జెట్ లో దాన్ని జగన్ సర్కార్ దాచిపెట్టిందని కాగ్ స్పష్టం చేసింది. కొన్ని నెలల క్రితం 48 వేల కోట్ల రూపాయలకు సంబంధించిన జమా, ఖర్చుపై అంతు చిక్కడం లేదని విపక్షాలు చెప్పాయి. అప్పుడు రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎద్దేవా చేయడం గుర్తుంచుకోవాల్సిన విషయం. ఇప్పుడు రాజ్యాంగ ప్రతిపత్తి గల కాగ్ స్వయంగా ఆ విషయమే స్పష్టం చేయడం విశేషం. ప్రజల నిధులను ఇష్టానుసారం లెక్కా పత్రం లేకుండా ఖర్చుచేస్తే ఊరుకునేది లేదని టీడీపీ రాజ్యసభ సభ్యుడు పయ్యావుల కేశవ్ అప్పుడే హెచ్చరించిన విషయం గుర్తుండే ఉంటుంది. అంతే కాకుండా ఏపీలో ఆర్థిక అవకతవకలపై కేంద్రం ఆర్థిక మంత్రిని కలిసి, విచారణ కోరతామని కూడా కేశవ్ ప్రకటించారు. కేంద్రం

ఉదారంగా ఇస్తున్న సాయంతో ఏపీ ఆదాయం బాగా పెరిగిందని, ఆ సొమ్మంతా ఏమైపోతోందో అర్థం కావడంలేదని పయ్యావుల తూర్పారపట్టారు. సర్కార్ పాల్పడ్డ 48 వేల కోట్ల రూపాయల అవకతవకలపై కేంద్రం జోక్యం చేసుకోవాలని మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు డిమాండ్ చేశారు. ప్రజల కోసం వైసీపీ సర్కార్ లక్షా 78 వేల కోట్లు ఖర్చు పెడితే.. 48 వేల కోట్లకు లెక్కలే లేపోవడాన్ని యనమల ప్రస్తావించారు. అంటే ఆ నిధులన్నింటినీ జగన్ రెడ్డి సర్కార్ దుర్వినియోగం చేసిందనేది యనమల ఆరోపణ. స్పెషల్ బిల్లుల పేరుతో ఖర్చుపెట్టినట్లు వైసీపీ సర్కార్ చెబుతుండడాన్ని ఆయన తప్పుపట్టారు. స్పెషల్ బిల్లులు అనేవి ట్రెజరీ కోడ్ లోనే లేవనే విషయాన్ని యనమల తెలిపారు. అసలు జగన్ సర్కార్ లో పీఏసీ వ్యవస్థ ఎందుకు సరిగా పనిచేయడంలేదని రామకృష్ణుడు ఆరోపించారు. అంటే పీఏసీ వ్యవస్థను కూడా జగన్ రెడ్డి సర్కార్ భయపెడుతోందనే అనుమానం ఆయన వ్యక్తం చేయడం గమనార్హం. వాస్తవానికి వైసీప ప్రభుత్వం పీఏసీ జరగనివ్వకుండా వ్యవహరిస్తోందంటున్నారు.

# మంత్రులతో సామూహిక రాజీనామా

విజయవాడ, మార్చి 28, ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు ముహూర్తం ఖరారైంది. తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ రోజునే కొత్త మంత్రి వర్గంకొలువుదీరనుంది. మార్చి 27, ఆదివారం ప్రస్తుత మంత్రులందరికీ ప్రత్యేక విందు ఇవ్వనున్నారట సీఎం జగన్. ఆ విందు తర్వాత కేబినెట్ పునర్ వ్యవస్థీకరణకు వీలు కల్పిస్తూ, ప్రస్తుత మంత్రివర్గంలోని మంత్రులందరితో మూకుమ్మడి రాజీనామాలు చేయించనున్నారు. పదవి కోల్పోయిన వారెవరూ డిసప్పాయింట్ కావొద్దని.. వారికి పార్టీలో కీలక బాధ్యతలు అప్పగిస్తామని.. మాజీలు కాబోయే వారిని ఓదార్చేందుకే ఆ డిన్నర్ మీటింగ్ అని అంటున్నారు. విందు భేటీ తర్వాత ముఖ్యమంత్రి కొత్త కేబినెట్‌కి తుది రూపం ఇవ్వనున్నారు. కొత్త కేబినెట్ లోనూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మంత్రి వర కూర్పులో పాత పద్ధతులనే కొనసాగిస్తారని అంటున్నారు. గతంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏకంగా ఐదుగురు మంత్రులకు ఉప ముఖ్యమంత్రి హోదా ఇచ్చారు. ఈసారి కూడా అదే ఆరో వేలు ఫార్ములా ఫాలో అవుతారని అంటున్నారు. పాత కాబినెట్'లో ఇచ్చిన విధంగానే కొత్త కేబినెట్' లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తారని అంటున్నారు. అలాగే, ఈసారి కూడా హోం శాఖను మహిళకే అప్పగించనున్నట్లు తెలిసింది. ఆ పదవికి ఎమ్మెల్యే రోజా పేరు బలంగా వినిపిస్తోంది. ఈ విషయమై రోజాను తెలుగువన్ సంప్రదించగా.. తనకు మంత్రి పదవి రాబోతున్న విషయాన్ని ఆమె కన్ఫామ్ చేశారు. కానీ, హోంశాఖ ఇస్తారనే విషయం మాత్రం తనకు తెలీదన్నారు. రెండున్నర ఏళ్ల తర్వాత కేబినెట్ పునర్వ్యవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన సందర్భంలోనే ప్రకటించారు. నిజానికి, ముఖ్యమంత్రి ముందుగా ప్రకటించిన గడువు కంటే ఆరు నెలలు ఆలస్యంగా పునర్వ్యవస్థీకరణ సిద్ధమయ్యారు. నిజానికి, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు సంబంధించి చాలా కాలంగా వార్తలు వస్తున్నా, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మొదలైన తర్వాతనే ముఖ్యమంత్రి స్వయంగా మంత్రివర్గ సమావేశంలో ఈ అంశాన్ని తొలిసారిగా ప్రస్తావించారు. పదవులు వదులుకునేందుకు సిద్ధం కావాలని మంత్రులకు సంకేత మిచ్చారు. ఇక అక్కడి నుంచి పలు సందర్భాలలో ముఖ్యమంత్రి ఈ విషయమై పదే పదే ప్రస్తావిస్తూ వచ్చారు. ప్రస్తుతం మంత్రుల్లో పని తీరు ఆధారంగా కేబినెట్ లో మార్పులు చేర్పులు ఉ ంటాయని తెలుస్తోంది. అయితే ఈ మార్పులు చేర్పులు ఏ స్థాయిలో ఉ ంటాయనే విషయంలో స్పష్టత అయితే ఇంతవరకు లేదనే అంటున్నారు. పూర్తి స్థాయి ప్రక్షాళన ఉంటుందా , లేక స్వల్ప మార్పులతో సరిపెడతారా అనేది తేలవలసి ఉంది. ముఖ్యమంత్రి సోదరి షర్మిల భర్త, అనిల్ కుమార్ అనుకోకుండా తెర మీదకు వచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీసీ ముఖ్యమంత్రి నినాదాన్ని వినిపిస్తున్నారు. ఈ ప్రభావం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఉంటుందా, సామాజిక సమీకరణాల విషయంలోనూ ఎలాంటి మార్పులు చేర్పులు ఉంటాయనే విషయంలో ఆసక్తి నెలకొంది.

మరో వంక మంత్రి పదవులు ఆశిస్తున్న, వైసీపీ ఎమ్మెల్యేలు మాత్రం ముఖ్యమంత్రిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. మూడేళ్ళగా అప్పులు తేవడంలో అలసి పోయిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి తనను మళ్ళీ మంత్రి వర్గంలోకి తీసుకున్నా ఆర్థిక శాఖ మాత్రం వద్దు మహాప్రభో అని ముఖ్యమంత్రి వేడుకుంటున్నారని అంటున్నారు. అదే విధంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ తీరును బట్టి ముఖ్యమంత్రి ముందస్తు ఎన్నికలకు వెళ్తారా, లేదా అనే విషయంలోనూ క్లారిటీ వస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఇక, మంత్రి పదవులు రాబోతున్నాయంటూ వినిపిస్తున్న ఎమ్మెల్యేలు సైతం అంత ఖుషీగా ఏమీ లేరు. ఇదంతా ఎన్నికల కోసమేనని.. ఎలక్షన్స్ వస్తున్నాయి కాబట్టి మాలాంటి వారిని తీసుకుంటున్నారని.. పెదవి విరుస్తున్నారు. మంత్రి పదవి వస్తోందనే సంతోషం వారిలో కనిపించడం లేదు. ఉన్నదంతా జగనన్నే స్వాహా చేస్తుంటే.. మంత్రి పదవి వచ్చినా.. తమకు పెద్దగా ఉపయోగం ఏముండదని.. ఖాళీ ఖజానాతో కేబినెట్ పోస్ట్ ఏం చేసుకోవాలని ఆఫ్ ది రికార్డ్ అంటున్నారు. ఇదలా ఉంటే, ఆరోవేలుతో సమానమైన మంత్రులను మార్చడం వలన ప్రయోజనం ఉండదని, మారిస్తే ముఖ్యమంత్రిని మార్చాలని విపక్షాలు సూచిస్తున్నాయి. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుత అధ్వాన్న స్థితికి చేరడానికి, ముఖ్యమంత్రి ఆలోచనా విధానాలే కారణమని ఆరోపిస్తున్న విపక్షాలు మంత్రి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ వలన రాష్ట్రానికి, ప్రజలకు జరిగే మేలు ఏదీ ఉందని అంటున్నారు.

# విశాఖలో బంద్ పాక్షికం

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా తలపెట్టిన విశాఖ బంద్ పాక్షికంగా జరిగింది. తెల్లవారుజామున 6 గంటల నుండి రోడ్లపైకి వచ్చిన బిజెపి, వైసిపి పార్టీలు మినహా అన్ని పార్టీలు బంద్ నిర్వహించారు. మద్దిలపాలెం సెంటర్ వద్ద సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల నేతలు రోడ్లపై బైఠాయించి జాతీయ రహదారిని దిగ్బంధించారు. వామపక్ష పార్టీల నేతలు సిహెచ్ నర్సింగ్ రావు, పడాల రమణ, విమల, తదితరులు రోడ్డుపై బైఠాయించి ఉదయం టిఫిన్ చేస్తూ నిరసన తెలియజేశారు. వామపక్ష పార్టీల కార్యకర్తలు ఆటపాట నిర్వహించారు. దీంతో కొంత సేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ ప్రజల మద్దతుతో విశాఖ బంద్ విజయవంతమైందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన ధరలు విపరీతంగా పెరిగాయని, అమలు చేస్తున్న కార్మిక చట్టాల వలన కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. విశాఖలోని కేంద్రంగా పరిశ్రమల కార్మికులు బంద్ లో సంపూర్ణంగా పాల్గొన్నారని, నిర్వహిస్తున్న బంద్ కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం విడనాడాలని డిమాండ్ చేశారు.

## గద్దె దించే దాకా నిద్ర పోము " కన్నెర్ర చేసిన కార్మికవర్గం"

బద్వేలు నమ్మకంతో దేశాన్ని పాలించమ0టే అమ్మకానికి తెరలేపిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆటలకు చరమగీతం పాడుతా మని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు అన్నారు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు ఏఐటియుసి సి ఐ టి యు పట్టణ సమితి ల ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద నుండి ర్యాలీ ప్రదర్శన, నాలుగు రోడ్ల కూడలి నందు ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయడానికి కంకణం కట్టుకున్న మోడీ గారు దేశంలోని కార్మిక కర్షక ఉద్యోగ పెన్షనర్ల హక్కులను కాలరాస్తున్నారని వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి బానిసలుగా మార్చే టువంటి కుట్ర పన్నుతున్నారని శ్రమజీవుల చెమట ద్వారా పోగయిన సంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్నారని వారు వాపోయారు సామాన్య ప్రజల పైన అధిక పనులను వడ్డించే విధంగా చట్టాలను చేస్తూ మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఇది ప్రజాస్వామ్యమా కార్పొరేట్ శక్తుల నియంతృత్వ పాలన అని వారు నిలదీశారు ఇప్పటికే భారతదేశంలో ని ప్రధాన వ్యవస్థ లైన బిఎస్ఎన్ఎల్ రైల్వే ఎల్ఐసి బ్యాంకుల ను ఆ దాని అంబానీలకు కట్టబెట్టి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్లోని విశాఖ ఉక్కు అమ్మే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం ఉ ండడం చాలా దారుణం అన్నారు

# శ్రీశైల క్షేత్రంలో మొదలైన ఉగాది ఉత్సవాల సందడి




శ్రీశైలం మార్చ్ 28 ద్వాదశ జ్యోతిర్లింగ, శక్తిపీఠమైన శ్రీశైల క్షేత్రంలో ఉ గాది ఉత్సవాల సందడి మొదలైంది. దక్షిణాది రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తుండడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. కాలినడక భక్తులకు అడుగడుగునా అన్నదానాలు.. మజ్జిగ పండ్లు పంపిణీ చేస్తూ అటవీ ప్రాంతంతో సహా హఠకేశ్వరం నుంచి క్షేత్ర ప్రధాన వీధి వరకు స్వచ్ఛంద సేవా సంఘాల కార్యక్రమాలతో సందడి వాతావరణం నెలకొంది. మరో రెండు రోజులు మాత్రమే గర్భాలయ స్పర్శదర్శనానికి అనుమతించనున్నందున స్వామివారి దర్శనానికి సుమారు 10 గంటలకుపైగా పడుతున్నది. కాగా శీఘ్ర దర్శనం కోసం రూ.500 టికెట్లు అందుబాటులో ఉండకపోవడం.. కంకణధారణ భక్తులు కూడా అధిక సంఖ్యలో క్యూలైన్ల వద్దకు చేరుకోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా కంపార్ట్మెంట్లు క్యూలైన్లలో అరకొర వసతులతో గంటల తరబడి వేచి ఉండలేక యాత్రికులు సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు. ఉత్సవాలకు ఊహించిన దానికంటే రెట్టింపు సంఖ్యలో భక్తులు వస్తుండడంతో అదుపు చెయ్యడం కష్టసాధ్యమవుతుందని ఆలయ సిబ్బంది వాపోయారు. ప్రతి రోజు సుమారు 70వేల మందికిపైగా వివిధ ప్రాంతాల నుండి క్షేత్రానికి చేరుకుంటున్నారని అధికారుల అంచనా. క్షేత్ర పరిధిలో వివిధవ భాషల్లో మరిన్ని సూచిక బోర్డులు, సమాచార కేంద్రాలు ఏర్పాటు చెయ్యాలని యాత్రికులు కోరుతున్నారు.

భక్తులు సహకరించాలి : ఈవో లవన్న

దేవస్థానానికి దర్శనం కోసం వచ్చే భక్తులు ఆలయ సిబ్బందితో సహకరించాలని ఈవో లవన్న కోరారు. ఉత్సవాలకు వచ్చే రద్దీ దృష్ట్యా పూర్తి ఏర్పాట్లు చేశామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉ ందన్నారు. కాలినడక భక్తులకు ప్రాధాన్యత ఇచ్చి స్పర్శ దర్శనాలు కల్పిస్తున్నందున స్వల్ప ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అదే విధంగా క్షేత్ర పురవీధుల్లోకి సొంత వాహనాలతో వస్తుండడంతో తిప్పలు ఎదురవుతున్నాయని, అలాగే ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయన్నారు. వాహనాలను నిలిపేందుకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ముఖ్యంగా క్యూలైన్లు, కంపార్ట్మెంట్లలో వేచి ఉండే భక్తులు సంయమనం పాటించాలని కోరారు. దేవస్థానం దాతల సహాయంతో అందించే అల్పాహారాలు, పాలు, మజ్జిగ అందుబాటులో అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు.

## ఎస్ ఆర్ పురం వద్ద 19 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

### ముగ్గురు స్మగ్లర్లు అరెస్టు
### పట్టుబడిన వారిలో ఆర్టీసీ డ్రైవర్

తిరుపతి ఎస్ ఆర్ పురం సమీపంలో 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లు ను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ ఎస్ పి మేడా సుందరరావు తెలిపారు. ఆయన సోమవారం టాస్క్ ఫోర్స్ ఆవరణలో మాట్లాడుతూ వీరి నుంచి రెండు మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆర్ ఐ సురేష్ కుమార్ రెడ్డి కి చెందిన ఆర్ ఎస్ ఐ వినోద్ కుమార్ రెడ్డి టీమ్ ఆదివారం రాత్రి నుంచి చిత్తూరు ఈస్ట్ డివిజన్ ఎస్ ఆర్ పురం మండలం లో కూంబింగ్ చేపట్టారని తెలిపారు. సోమవారం ఉదయం ఎస్ ఆర్ పురం మండలం పుత్తూరు మెయిన్ రోడ్డు సమీపంలో ఉన్న మట్టి రోడ్డు వద్ద ముగ్గురు వ్యక్తులు రెండు మోటారు సైకిళ్ళు పై వస్తూ కనిపించారని చెప్పారు. అయితే వారు టాస్క్ ఫోర్స్ సిబ్బందిని చూసి పారి పోయే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. వారిని పట్టుకోవడం తో వారి వద్ద మూడు ఎర్రచందనం దుంగలు లభించాయి. వీరిని ఎస్ ఆర్ పురం మండలంకు చెందిన రంజిత్ (25), శంకర్ (32), మంగ సముద్రం కు చెందిన రవి (37) గా గుర్తించారు. వీరిలో రంజిత్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ గా గుర్తించారని చెప్పారు. వీరిని విచారించగా ఆయకట్టు చెరువులో దాచి ఉంచిన 16 ఎర్రచందనం దుంగలను కనుగొన్నామని తెలిపారు. ఇవి 590 కిలోలు ఉన్నాయని, వీటి విలువ 40 లక్షల రూపాయలు వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ డిఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో జరిగిందన్నారు. కేసును సి ఐ చంద్రశేఖర్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్పీ మేడా సుందరరావు, ఆర్ ఐ సురేష్ కుమార్ రెడ్డి, సి ఐలు చంద్రశేఖర్, రామకృష్ణ, ఎస్ ఐ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ దుర్మార్గం

### మండిపడ్డ కార్మిక సంఘాల నేతలు

విజయవాడ,మార్చి28 బెజవాడలో కార్మిక సంఘాల బహిరంగ సభ నిర్వహించారు. రెండ్రోజులు దేశవ్యాప్తంగా సమ్మె నేపథ్యంలో విజయవాడలో కార్మిక సంఘాలు బహిరంగసభను ఏర్పాటు చేశారు. లెనిన్ సెంటర్ బహిరంగసభకు కార్మికులు, కార్మిక సంఘ నేతలు భారీగా తరలివచ్చారు. కార్మికుల హక్కులు, చట్టాలు కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని కార్మిక సంఘం నేతలు ఆవేదన చెందారు. కార్మిక సంఘ నేతలు మాట్లాడుతూ... మోదీ సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైయివేటు చేసి, కార్పోరేట్ సంస్థలకు రెడ్ కార్పోరేట్ పరుస్తోందని మండిపడ్డారు. కార్మిక హక్కులు, చట్టాలను మోదీ సర్కార్ కాలరాస్తోందన్నారు. రానున్న రోజుల్లో మోదీ సర్కార్ తప్పులు సరిదిద్దుకోకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రైతులు, కార్మికులను సంక్షోభంలోకి నెట్టారని కార్మిక సంఘ నేతలు విమర్శలు గుప్పించారు.

# విడుదల రజనీకి ఇంటి పోరు

గుంటూరు, మార్చి 28,రాజకీయం అంటే.. చాలా చేయాలి.. అందుకు చాలా బ్యాక్ గ్రౌండ్ ఉండాలి.. దానికి తోడు పార్టీ అధినేత దగ్గర భజన చేయాలి.. చేసి తీరాలి.. అలా అయితేనే.. ఎన్నికల్లో గెలుస్తామో లేదో తర్వాత.. ముందు ఎమ్మెల్యే టికెట్ వస్తుంది. కానీ ఇవేమీ లేకుండా.. పార్టీలో ఇలా అడుగు పెట్టి.. అలా ఎమ్మెల్యే టికెట్టు తీసుకుని.. ఎన్నికల్లో గెలిచి.. ఆ వెంటనే అసెంబ్లీలో అడుగు పెట్టి అధ్యక్షా.. అన్నారంటే .. వారికి చాలా లక్ ఉండి ఉండాలి. తాజాగా ఆ కోవలోకే వస్తోంది విడదల రజినీ. గుంటూరు జిల్లా చిలకలూరిపేట అసెంబ్లీ స్థానం నుంచి 2019 ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసి.. ఎనిమిది వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారీ రజినీ. అంతకు ముందు ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం కూడా ఆమెకు ఏ కోశానా లేదు. అలాగే ఆమెకు ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ కూడా లేకుండా.. కానీ ఇలా వచ్చి.. అలా దూసుకుపోతోందీ విడదల రజినీ. ఇంతకీ ఆమె బ్యాక్ గ్రౌండ్ ఏమిటి.. ఆమె పొలిటికల్ ఎంట్రీ అసలు ఎలా జరిగిందంటూ ఆమె ఫ్యాన్స్ గూగుల్ తల్లిని జల్లెడ పడుతోంది. 1990, జూన్ 24న గుంటూరు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని పురుషోత్తపట్నంలో విడదల రజినీ జన్మించారు. ఆమె బాల్యమంతా అక్కడే గడిచింది. ఆ తర్వాత అంటే 2011లో సికింద్రాబాద్ మల్కాజ్‌గిరిలోని సెయింట్ ఆన్స్ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ చదివి గ్రాడ్యుయేట్ పట్టా పొందింది. అనంతరం కర్ణాటకలోని చిత్రదుర్గంలో జేయంఐటీ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి బీటెక్ పట్టా అందుకున్నారు. ఆ తర్వాత యూఎస్‌లో ఓ ప్రముఖ కంపెనీలో ఐటీ ఉద్యోగం చేరి.. తన పనితనంతో ఆమె అందరి మొప్పు పొందారు. ఆ తర్వాత అక్కడే ప్రొసెస్ వేయివర్ అనే సాఫ్ట్‌వేర్ బిజినెస్ పెట్టి.. ఆ వ్యాపారాన్ని సైతం లాభాల బాట పట్టించింది.. వ్యాపార రంగంలో కూడా విడదల రజినీ రాణించారు. యూఎస్‌లో జాబ్ చేస్తున్నప్పుడే.. కుమార స్వామితో ఆమెకు వివాహం అయింది. ఆయన కూడా యూఎస్‌లో పేరు పొందిన పారిశ్రామిక వేత్తే. అయితే 2014 ఎన్నికలల్లో కొంత మంది యూఎస్‌లోని పారిశ్రామిక వేత్తలు.. తెలుగుదేశం పార్టీ మీద అభిమానంతో.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చి.. ఆ పార్టీ ప్రచార పనుల్లో చాలా చురుగ్గా పాల్గొన్నారు. అలా వచ్చిన వారిలో విడదల రజినీ కూడా ఒకరు. టీడీపీ ప్రచార పనుల్లో చురుగ్గా పాల్గొని.. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ విజయానికి తన వంతు తోడ్పాటునందించారీ విడదల రజినీ. 2014లో ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో విడదల రజినీ.. సైకిల్ పార్టీలో చేరి.. తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆమెకు జీవితంలో ఉండే కష్టనష్టాల గురించి తెలుసు. ఈ నేపథ్యంలో విడదల రజినీ.. వీఆర్ ఫౌండేషన్ అండ్ ట్రస్ట్‌ను ప్రారంభించి.. ప్రజా సేవకు తన వంతు సహాయ సహకారాలు అందించారు. అలా వీఆర్ ట్రస్ట్ ద్వారా.. పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి.. చిలకలూరిపేట ప్రజలల్లో కలిసిపోయారీ రజినీ. అంతేకాదు.. తెలుగులోనే కాకుండా ఇంగ్లీష్, హిందీ భాషల్లో అనర్గళంగా మాట్లాడే సత్తాతోపాటు మంచి వాక్చాతుర్యం ఉన్నా.. ఈ విడదల రజినీ టాలెంట్‌ను ప్రత్తిపాటి పుల్లారావు గుర్తించారు. ఆ క్రమంలో విశాఖపట్నం వేదికగా జరుగుతోన్న మహానాడులో.. చంద్రబాబుతో మాట్లాడి మరీ విడదల రజినీకి అవకాశం ఇప్పించారీ ప్రత్తిపాటి పుల్లారావు. ఈ వేదికగా తన వాక్చాతుర్యంతో విడదల రజినీ అదరగొట్టింది. హైదరాబాద్‌లోని సైబరాబాద్‌లో మీరు నాటిన ఈ మొక్క అంటూ రజినీ.. తన మాటల గారడీతో.. చంద్రబాబునే కాదు.. పసుపు పార్టీలోని లీడర్ నుంచి కేడర్ వరకు అందరినీ మాయ చేసేసింది. ఇదే సభ వేదికపై నుంచి నాటి ప్రతిపక్ష నేత వైయస్ జగన్, ఆయన తండ్రి వైయస్ రాజశేఖరరెడ్డిలు నరకాసురులు అంటూ అభివర్ణించిందీ విడదల రజినీ. దీంతో సభలో వేదికపైన ఉన్న పెద్దలతోపాటు ఈ సభకు వచ్చిన కార్యకర్తల సైతం కొట్టిన చప్పట్లతో మహానాడు మారు మోగిపోయిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.అలాగే విడదల రజినీ మాట్లాడిన మాటల వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయినాయి. దీంతో రజినీ.. ఒక్కసారిగా తెలుగింట పాపులర్ అయిపోయారు. పవర్ ఫుల్ పీపుల్ కమ్ ఫ్రమ్.. పవర్ ఫుల్ ప్లేసెస్ అని రజినీకి ఆ వేదికగా బాగా అర్థమైంది. అందుకే తన రాజకీయ ప్రస్థానానికి కారణమైన.. పుల్లారావు సీటు కోసం.. రజినీ తీవ్రంగా ప్రయత్నించారు. కానీ పార్టీలో ప్రత్తిపాటి పుల్లారావు సీనియర్.. అంతేకాదు.. చంద్రబాబు కేబినెట్‌లో ఆయన మంత్రి కూడా. ఈ నేపథ్యంలో ఆయనకే చిలకలూరి పేట సీటు అంటూ టీడీపీ అధిష్టానం క్లియర్ కట్‌గా చెప్పేసింది. మరోవైపు.. టీడీపీకి భవిష్యత్తు లేదని రజినీకి బాగా అర్థమైంది. ఆ క్రమంలో పాదయాత్ర చేస్తూ.. ప్రజా సమస్యలపై గొంతెత్తి మాట్లాడుతోన్న ప్రతిపక్ష నేత వైయస్ జగన్ విజయవాడకు చేరుకున్నారు. ఆయన సమక్షంలో విడుదల రజినీ.. జగన్ పార్టీ కండువా కప్పుకొని.. ఫ్యాన్ కిందకు చేరి పోయారు. 2019 ఎన్నికల్లో చిలకలూరి పేట నుంచి ఫ్యాన్ పార్టీ అభ్యర్థిగా మర్రి రాజశేఖర్‌ను రంగంలోకి దింపాలని జగన్ భావించారు. కానీ అప్పటికప్పుడు తన రాజకీయ చాణక్యానికి రజనీ పదును పెట్టి మరీ.. తనకు అనుకూలంగా పరిస్థితులను అప్పటికప్పుడు మార్చేసుకున్నారనే టాక్ అయితే నేటికి సదరు నియోజకవర్గంలో వైరల్ అవుతోంది. ఆ క్రమంలో ఈ వ్యవహారంలో సీనియర్ నేత మర్రి రాజశేఖర్... అలకబూనడం.. దీంతో ఈ పంచాయతీ కాస్తా.. నాటి ప్రతిపక్ష నేత వైయస్ జగన్‌తోపాటు ఆ పార్టీ కీలక నేతలు వద్దకు చేరడం... దాంతో ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీకు ఎమ్మెల్సీ పదవి గ్యారంటీ అంటూ మర్రి రాజశేఖర్ రెడ్డికి ఫ్యాన్ పార్టీలోని సదరు అగ్రనేతలంతా నాడు చేతిలో ఓట్టేసి మరీ చెప్పాడంతో.. అలకవీడిన మర్రి రాజశేఖర్.. తన సూచనలు, సలహాలతో రజినీని గెలుపు బాట పట్టించడమే కాదు.. ఆమెను బంపర్ మెజార్టీతో గెలుపెంచారు. ఎమ్మెల్యే అయిన తర్వాత.. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. కామన్‌మెన్ లీడర్‌గా పేరు సంపాదించిందీ విడదల రజినీ.. తన సేవా కార్యక్రమాలతో.. తన రాజకీయ జీవితానికి కారణమైనా.. ప్రత్తిపాటి పుల్లారావుకు ఓటమి రుచి చూపించింది. అప్పటికే 2009, 2014 ఎన్నికల్లో వరస గెలుపును చూసిన పుల్లారావు.. హాట్రిక్ కొట్టేందుకు ఆయన తీవ్రంగా కృషి చేశారు. కానీ విడదల రజినీ గెలుపుతో ఆయన హ్యాట్రిక్ గెలుపుకు ఫుల్ స్టాప్ పెట్టాల్సి వచ్చింది. అయితే 2014లో మర్రి రాజశేఖర్ మీద.. ప్రత్తిపాటి పుల్లారావు గెలుపొందారు. అలాంటి నాయకుడిపై 8 వేల ఓట్ల అధిక్యంతో రజినీ విజయం సాధించారు. ఎన్నికల్లో గెలుపు కోసం .. డబ్బులు పంచితే సరిపోదని. ప్రజల తోడు కూడా ఉండాలని నిరూపించిందీ రజినీ. బీసీల అభివృద్ధి, మహిళల రక్షణ, నవరత్నాలు, టీడీపీపై అప్పటికే ప్రజల్లో ఉన్న అపనమ్మకాన్ని.. ఇంకా బలంగా తీసుకు వెళ్లి.. తన గెలుపునకు బాటలు వేసుకోవడంలో రజినీ 100 శాతం సఫలీకృతులయ్యారు. దీంతో పాటు రజినీ గెలుపునకు సోషల్ మీడియా కూడా తన వంతు సహాయ సహకారాలు అందించింది. మరోవైపు పోల్ బూత్ మేనేజ్‌మెంట్ మీద రజినీ మంచి పట్టు సంపాదించింది. అంతేకాకుండా వీఆర్ ఫౌండేషన్ పేరుతో గ్రామాల్లో మంచి నీరు సరఫరా సౌకర్యం కల్పించడంతోపాటు మౌలిక సదుపాయాలను సైతం అందేలా రజినీ చర్యలు తీసుకొంది. దీంతో అందరి నోట రజినీ.. రజినీ పేరు వినబడేలా చేసుకొంది. అదీకాక చిలకలూరి పేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తొలిసారి బీసీ మహిళా ఎమ్మెల్యేగా విడదల రజినీ చరిత్ర సృష్టించింది. సేవా కార్యక్రమాల్లో రజినీ చురుగ్గా ఉండడం వల్లే బీసీ సంక్షేమ సంఘంలో ఆమె ముఖ్య నాయకురాలిగా ఎదిగారు. ఇప్పటికీ తాను ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడానికి కోసం విడదల రజినీ శక్తి వంచన లేకుండా కృషి చేస్తోంది.

## ఎమ్మెల్యే కు మంత్రి పదవి ఇవ్వాలని వెంకటాపురం నుంచి శ్రీశైలం కాలినడక

మంత్రి పదవి ఇస్తే రాష్ట్రానికి సేవలు

ప్రజల మన్ననలు పొందిన ఏకైక నాయకుడు మన ఎమ్మెల్యే

వైసీపీ యువ నాయకులు మాజీ ఎంపీటీసీ చౌదరి బసవ

కౌతాళం మంత్రాలయం నియోజకవర్గం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కి మంత్రి పదవి ఇవ్వాలని రాష్ట్రానికి మరిన్ని సేవలు చేసుకోవాలని ప్రజమన్ననలు పొందిన ఏకైక నాయకుడు మన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అని వైసిపి నాయకులు మరియు మాజీ ఎంపిటిసి చౌదరి బసవ పేర్కొన్నారు. మంత్రి పదవి రావాలని ఆదివారం వెంకటాపురం నుంచి శ్రీశైలం కాలినడకన బయలుదేరారు. వారు పత్రికా సమావేశంలో మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గం ఏర్పడిన నుంచి తిరుగులేని మెజారిటీతో ఎదురులేని నేతగా విజయం సాధిస్తూ మూడు సార్లు ఎన్నికల్లో భారీ విజయం సాధించిన ఘనత మన బాలనాగిరెడ్డి అని రాష్ట్ర ముఖ్యమంత్రి మంత్రి వర్గ విస్తరణలో మన ఎమ్మెల్యే గారికి మంత్రి పదవి రావాలని ఆశిస్తూ శ్రీశైలమునకు కాలినడకన బయలు దేరుతున్న మని శ్రీశైలం భ్రమరాంబిక దేవి శ్రీ మల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొంది మరి మరి కోరుకుంటానని తెలిపారు. మా కుటుంబ సభ్యులంతా, మన నాయకులంతా ఎమ్మెల్యే కు కట్టుబడి ఉన్నామని ఆయనకు తప్పకుండా మంత్రి పదవి కావాలని భగవంతుని కోరుకుంటున్నామని తెలియజేశారు. మంత్రి పదవి రావాలని మా కుటుంబ సభ్యులు కూడా శ్రీశైలం లకు బయలుదేరుతున్న అని తెలిపారు. గత ప్రభుత్వం ఎన్నో ప్రబోధాలు పెట్టిన ఎన్ని ఇబ్బందులు పెట్టిన లొంగకుండా అధికార పార్టీని ఎదిరించి కష్టనష్టాలకు ఓర్చుకొని కార్యకర్తలకు నాయకులకు ధైర్యం నూరిపోస్తూ పార్టీని అంటిపెట్టుకుని ముఖ్యమంత్రి నాయకత్వంలో పని చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. పార్టీని నమ్ముకున్న వారికి నిజమైన నాయకులకు మంత్రి వర్గ విస్తరణలో క్యాబినేట్ లో తగిన గౌరవం ఇవ్వాలని తప్పకుండా మంత్రి పదవి రావాలని వస్తుందని ఆశిస్తున్నామని భగవంతుని కోరుకుంటున్నాము. మంత్రాలయం నియోజకవర్గంలో ప్రజల మన్ననలు పొందిన ఏకైక నాయకుడు మన బాలనాగిరెడ్డి అని జనం మెచ్చిన నాయకులని ఎన్నో పలు అభివృద్ధి కార్యక్రమాలు తన వంతు సేవలు నిర్వహించరని మంత్రి పదవి వస్తే మరెన్నో రాష్ట్రంలో సేవలు నిర్వహిస్తారని ప్రజ సేవకే నిరంతరం కృషి చేస్తారని ఆ భగవంతుని భ్రమరాంబ దేవి శ్రీ మల్లికార్జున స్వామి సన్నిధిలో మంత్రి పదవి రవలని మా కుటుంబ సభ్యులతో వేడుకుంటున్నామని తెలిపారు. దేవుని దయవల్ల ఎమ్మెల్యే కు మంత్రి పదవి వస్తే మంత్రాలయం నియోజకవర్గం ప్రజలు ఎంతో సంతోషిస్తారని తెలిపారు. వీరితో పాటు కుటుంబ సభ్యులు ఉన్నారు.

## పరువు తీస్తున్న పీఏలు

అనంతపురం, మార్చి 28, బాలయ్య. నటనను ప్రాణంగా ప్రేమిస్తారు. వయస్సు మీద పడినా.. హీరోయిజం చూపించే పాత్రలు చేయడంలో ఎక్కడా తగ్గడం లేదు. నటనకు ఎంత ప్రయారిటీ ఇస్తారో.. జాతకాలు.. ముహూర్తాలు, దోషాలకు అంతే ప్రాధాన్యం ఇస్తారు. ముహూర్తం లేందే ఏ పనీ చేయరు. కాలు బయట పెట్టరు. ముహూర్తాలపై అంతలా నమ్మకం పెట్టే బాలయ్యకు పాపం.. పీఏల రూపంలో గండాలు ఎదురవుతున్నాయి. తలనొప్పులు తప్పడం లేదు.బాలకృష్ణ.. సినిమాల్లో ఎంత పవర్‌ఫుల్ యాక్టరో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. రాజకీయాల్లోకి వచ్చాక కూడా ఆయన సక్సెస్‌ను ఎవరూ ఆపలేకపోయారు. హిందూపురం నుంచి వరసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రికార్డ్ సృష్టించారు. గాలివాటం నాయకుడిగా కాకుండా.. కేడర్‌కు అందుబాటులో ఉండటం.. ఎప్పటికప్పుడు హిందూపురం సమస్యలపై అప్‌డేట్‌గా ఉంటారు. వైసీపీ గాలి బలంగా ఉన్న 2019 ఎన్నికల్లో కూడా ఆయన గతం కంటే ఎక్కువ మెజారిటీ సాధించారు. దీనికి బాలకృష్ణ ఇమేజే అని చెప్పాలి. రాజకీయాలు.. సినిమాలు బ్యాలెన్స్ చేసుకుని వెళ్తుంటారు. ఆయన ఎక్కడ ఉన్నా హిందూపురంపై ఫోకస్ ఉంటుంది. నియోజకవర్గంలో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే వాటిమీద ఫోకస్ పెట్టేందుకు ప్రయత్నిస్తారు బాలయ్య. జనంతో సమస్యలు లేని బాలయ్యకు ఇప్పుడు తన సొంత మనుషులతో సమస్యలు వచ్చి పడ్డాయి. బాలయ్యకు అన్నీ కలిసి వస్తున్నాయి కానీ పీఏలు కలిసి రావడం లేదు. పీఏలు ఎప్పటికప్పుడు ఆయనకు తలనొప్పిగా మారారు.ఎమ్మెల్యేగా బాలకృష్ణ హిందూపురంలో లేని సమయంలో అక్కడ పార్టీ వ్యవహారాలను పీఏలు చక్కబెడుతుంటారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో బాలయ్య పీఏగా ఉన్న శేఖర్ తీవ్ర వివాదాస్పదంగా మారారు. ఎన్నోసార్లు ఆయనపై బాలకృష్ణకు ఫిర్యాదు చేశారు కేడర్. చివరకు సొంతపార్టీ నాయకులే శేఖర్‌కు వ్యతిరేకంగా ఆనాడు ప్రెస్‌మీట్ పెట్టి బహిరంగ విమర్శలు చేశారు కూడా. ఆ గొడవ అప్పట్లో చంద్రబాబు వరకు వెళ్లింది. మొదట్లో ఆ ఆరోపణలను లైట్ తీసుకున్న బాలయ్య.. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో పీఏ శేఖర్‌ను తప్పించేశారు.శేఖర్ తర్వాత సీన్‌లోకి పీఏగా టీచర్‌గా పనిచేస్తున్న బాలాజీ వచ్చారు. తొలిరోజుల్లో బాలాజీ బాగానే కనిపించినా.. మెల్లగా ఆయనది కూడా సేమ్ సీన్ అయ్యింది. మళ్లీ విమర్శలు రావడంతో బాలాజీని సాగనంపారు బాలయ్య. అయితే 2019లో మళ్లీ ఎమ్మెల్యేగా బాలకృష్ణ గెలిచాక తిరిగి బాలాజీనే పీఏగా పెట్టుకున్నారు.

## అమాత్య పిలుపు కోసం... కరణం ఎదురు చూపులు

ఒంగోలు, మార్చి 28, రాజకీయాల్లో 40ఏళ్లకు పైగా ఉన్న సీనియర్ నేత. ఆయనతో రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన నాయకులు సీఎంలై.. మంత్రులై చక్రం తిప్పారు. ఆయనకు మాత్రం మంత్రి పదవి అందని ద్రాక్షగా మారింది. ఆయన గెలిస్తే పార్టీ అధికారంలోకి రాదు.. పార్టీ అధికారంలోకి వస్తే ఆయన గెలవరు. ప్రస్తుతం పార్టీ మారి అధికారపార్టీ పంచన చేరారు. ఈసారైనా మంత్రి పదవి వరిస్తుందా? అసలు ఆయన అలాంటి ఆశలు పెట్టుకున్నారా?కరణం బలరాం. ఏపీ రాజకీయాల్లో పరిచయం చేయాల్సిన అవసరం లేని పేరు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి ఎంపీగా గెలిచారు. ఆయన గెలిస్తే ఆ పార్టీ అధికారంలో ఉండదు. ఆయన ఉన్న పార్టీ అధికారంలో ఉంటే ఆయన గెలవరు. దీంతో మంత్రి పదవి రాకుండా పోయింది. ఓడిన నేతలకు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రులను చేసిన చంద్రబాబు.. బలరామ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చారు కానీ మంత్రిని చేయలేదు.వైఎస్.. చంద్రబాబు వంటి సీనియర్ నేతలతోపాటుగా రాజకీయ ప్రస్థానాన్ని మొదలు పెట్టినా బలరాం ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా మంత్రి పదవి చేపట్టలేదు. యూత్ కాంగ్రెస్ నాయకుడిగా రాజకీయ అరంగ్రేటం చేసిన కరణం.. 1977లో ఎన్నికల ప్రచారానికి ఒంగోలు వచ్చిన ఇందిరాగాంధీ మీద రెడ్డి కాంగ్రెస్ నేతల దాడి చేయబోతే.. ఆమెకు రక్షణగా నిలబడి దేశవ్యాప్తంగా అప్పుడు పాపులర్ అయ్యారు. 1978లో కాంగ్రెస్ ఐ తరపున అద్దంకిలో పార్టీ అభ్యర్థిగా బలరాం పేరును స్వయంగా ఇందిరాగాంధీ సిఫారసు చేశారు. ఆ ఎన్నికలలో గెలిచి తొలిసారి శాసనసభలో అడుగు పెట్టారు బలరాం. ఆ తర్వాత టీడీపీలో చేరారు.బలరాం స్వగ్రామం చీరాలకు దగ్గరగా ఉండే తిమ్మసముద్రం అయినప్పటికీ రాజకీయ ప్రస్థానం మొత్తం అద్దంకి, మార్టూరు నియోజకవర్గాలతో ముడిపడి ఉంది. 2019 ఎన్నికల నాటికి టీడీపీలో ఉన్న ఆమంచి కృష్ణమోహన్ వైసీపీలో చేరటంతో.. కరణంను చీరాల అభ్యర్థిగా బరిలో దించింది తెలుగుదేశం పార్టీ. చీరాలలో 18వేల మెజారిటీతో గెలిచారు బలరాం. అయితే ఆయన గెలిచి.. టీడీపీ అధికారంలోకి రాకపోవడంతో ప్రతిపక్షపార్టీ ఎమ్మెల్యేగా ఉండిపోవాల్సి వచ్చింది. ఆమంచి ఓడినప్పటికీ ఇంచార్జ్ హోదాలో ఎమ్మెల్యే అధికారాన్ని చెలాయిస్తూ నియోజకవర్గంలో పనులు చేసుకుంటూ పోయారు. దీంతో కరణం.. ఆమంచి మధ్య హోరాహోరీగా కార్యక్రమాలు నడిచాయి. చివరకు కుమారుడు వెంకటేష్ రాజకీయ భవిష్యత్ గురించి ఆలోచించారో ఏమో సీఎం జగన్‌కు జైకొట్టారు బలరాంవైసీపీలో చేరినా తమ నేతకు సరైన గుర్తింపు లేదన్నది బలరాం వర్గీయుల టాక్. కరణం వెంకటేష్‌కు ఏదైనా కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇస్తారని భావించినా సాధ్యం కాలేదు. కేవలం ఆమంచి స్పీడ్‌కు బ్రేకులు వేయడం మినహా.. వైసీపీలోకి వెళ్లడం వల్ల కలిగిన ప్రయోజనం ఏదీ లేదన్నది అనుచరుల ఆవేదన. ప్రస్తుతం కేబినెట్‌లో మార్పులు చేర్పులకు సమయం దగ్గరపడటంతో కరణం బలరాం చర్చల్లోకి వచ్చారు. కొత్తగా ఏర్పడే బాపట్ల జిల్లాలోకి చీరాల వెళ్తుండటంతో ఆయనకు కలిసొస్తుందని అనుచరులు లెక్కలు వేస్తున్నారుబాపట్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ బలంగా ఉంది. అక్కడ వైసీపీని బలోపేతం చేయాలంటే సామాజికవర్గం పరంగా కూడా గట్టి నేత ఆపార్టీకి కావాలనేది బలరాం అనుచరుల లెక్క. కరణం బలరామ్‌ను కేబినెట్‌లోకి తీసుకుంటే వైసీపీ బలోపేతం కావడంతోపాటు ఆయన సామాజికవర్గానికి కూడా ప్రాధాన్యం కల్పించినట్టు అవుతుందని అంచనా వేస్తున్నారట.మాజీ ఎమ్మెల్యే ఆమంచి సీటు విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది. పార్టీని బలోపేతం చేసేందుకు బలరాం, ఆయన కుమారుడు వెంకటేష్‌ను పర్చూరు, అద్దంకి పంపుతారనే ప్రచారం జరుగుతోంది. అప్పుడు ఆమంచికి లైన్ క్లియర్ అయినట్టే. వచ్చే ఎన్నికల్లో కరణం కుమారుడు వెంకటేశే బరిలో నిలిచే అవకాశాలు ఉండటంతో బలరాం మంత్రి పదవి ఆశలు నెరవేరుతాయా? ఆయన కోరిక తీరుతుందా? సీఎం జగన్ బలరామ్ గురించి ఏం ఆలోచిస్తున్నారో చూడాలి.

## డబ్బు ఏమైందో ప్రజలకు చెప్పవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది

ఐహెచ్ఆర్ఏ సివిల్ రైట్స్ ఏపి ఛైర్మన్

కరణం తిరుపతి నాయుడు

అమరావతి మార్చ్ 28 వైసీపీ ప్రభుత్వం చేసిన వ్యయంలో రూ. 48వేల కోట్లకు లెక్కా.. జమా లేదు. రాజ్యాంగ ప్రతిపత్తి కలిగిన ఆడిట్ సంస్థ కాగ్ అధికారికంగా తన నివేదికలో పేర్కొన్న నేపద్యం లో వెంటనే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఐహెచ్ఆర్ఏ సివిల్ రైట్స్ ఏపి ఛైర్మన్ కరణం తిరుపతి నాయుడు విజ్ఞప్తి చేసారు.జగన్ ప్రభుత్వానికి ఆడిట్ సర్టిఫికేట్ ఇవ్వడానికి కూడా కాగ్ భయపడిందంటే జగన్ ప్రభుత్వం ఏమేరకు అవినీతికి పాల్ పడిందో అర్దమవుతున్దన్నారు. లెక్కలు అంతుపట్టనప్పుడు ఇచ్చే క్వాలిఫైడ్ ఒపీనియన్‌ను జగన్ ప్రభుత్వ జమా ఖర్చులపై కాగ్ ఇచ్చిందని, దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వంపై కాగ్ ఇటువంటి అభిప్రాయం వ్యక్తం చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం మొత్తానికి లెక్కలు లేకపోవడం ఆర్థిక అరాచకానికి పరాకాష్టగా ఆయన అభివర్ణించారు. రూ. 48వేల కోట్ల వ్యయానికి లెక్కలు దొరకడంలేదని విపక్షాలు కొన్ని నెలల కిందట చెబితే ఆర్థిక మంత్రి బుగ్గన ఎగతాళి చేశారు. ఇప్పుడు స్వయంగా కాగ్ ఇదే విషయం చెప్పింది. ప్రభుత్వం ఇష్టానుసారం లెక్కా.. జమా లేకుండా నిధులు దుర్వినియోగం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక లావాదేవిలను నడుపుతున్నదాని స్పస్తామవుతున్దన్నారు.కేంద్ర ఆర్థిక మంత్రిని కలిసి ఆర్థిక అవకతవకలపై విచారణ జరపాలని తిరుపతి నాయుడు డిమాండ్ చేసారు.. కేంద్రం ఉదారంగా ఇస్తున్న సాయంతో రాష్ట్ర ఆదాయం విపరీతంగా పెరిగిందని.. అయినా ఇదంతా ఎటుపోతోందో ఆర్థం కావడంలేదన్నారు.ప్రభుత్వం చెప్పినదానికి సంబంధం లేకుండా జరుగుతోందంటే... అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? అనే సందేహం కలుగుతోందన్నారు. ఆర్థిక అరాచకానికి పరాకాష్టని అన్నారు. దీన్ని ఆర్థిక తీవ్రవాదం అంటారా? ఆర్థిక అనావృష్టి అంటారా? ఏమంటారని ఆయన ప్రశ్నించారు.కార్పొరేషన్ ద్వారా చేసిన అప్పులను బడ్జెట్‌లో చూపెట్టలేదన్నారు. సివిల్ సప్లైస్ బడ్జెట్ రూ. 4,622 కోట్లు.. అయితే ఖర్చు పెట్టింది కేవలం రూ. 104 కోట్లు మాత్రమేనన్నారు. బీసీ వెల్ఫేర్ కోసం ఖర్చు పెట్టింది ఏమి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు ఎంత ఉన్నాయో చూపెట్టలేదని పేర్కొన్నారు. ఈ డబ్బు ఏమైందో చెప్పవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని ఆయన అన్నారు

## టిటిడి హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఘనంగా మెట్లోత్సవం

తిరుపతి, మార్చి 28 శ్రీ తాళ్లపాక అన్నమయ్య 519వ వర్ధంతిని పురస్కరించుకుని టిటిడి ఆల్ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో గురువారం ఉదయం అలిపిరి పాదాలమండపం వద్ద మెట్లోత్సవం వైభవంగా జరిగింది. టిటిడి జెఈవో వీరబ్రహ్మం మెట్లపూజ నిర్వహించి మెట్లోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టుల సంచాలకులు డాక్టర్ ఆకెళ్ల.విభీషణ శర్మ మాట్లాడుతూ అన్నమయ్య తన సంకీర్తనలతో భక్తి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి సామాజిక చైతన్యాన్ని తీసుకువచ్చారని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరు ఉద్యోగ, కుటుంబ ధర్మాలు ఆచరించాలని, సాంఘిక ధర్మాల వల్లే సమాజంలో సుఖ శాంతులు కలుగుతాయన్నారు. అన్నమయ్య తన భక్తి సంకీర్తనలతో సామాజిక, మానసిక శాస్త్రవేత్తగా సమాజాన్ని నడిపించారని వివరించారు. మెట్లోత్సవంలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన వెయ్యి మందికిపైగా అన్నమాచార్య ప్రాజెక్టు, డిపిపి, దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులు భజనలు చేసుకుంటూ సప్తగిరులను అధిరోహించి స్వామివారిని దర్శించుకుంటారని చెప్పారు. మార్చి 29వ తేదీన సాయంత్రం తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో సప్తగిరి సంకీర్తనల గోష్టిగానం ఉంటుందన్నారు. మార్చి 29 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, మహతి కళాక్షేత్రం, తాళ్లపాక, అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద ప్రముఖ కళాకారులతో భక్తి, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఆకట్టుకున్న సంకీర్తనల గోష్టిగానం :ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సంకీర్తనల గోష్టిగానం చేపట్టారు. ఇందులో 'బ్రహ్మ కడిగిన పాదము...., భావములోన బాహ్యమునందును..., ఎంతమాత్రమున ఎవ్వరు దలచిన అంతమాత్రమే నీవు..., పొడగంటిమయ్య నిన్ను పురుషోత్తమా..., కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు వాడు...., నారాయణతే నమోనమో...., ముద్దుగారే యశోద...." కీర్తనలున్నాయి. భక్తులు పరవశించి గోష్టిగానంలో పాలు పంచుకున్నారు.

## నెరవేరింది ఏడున్నరేండ్ల ప్రజల కోరిక



భక్తులకు పునర్దర్శన మిచ్చిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి

యాదాద్రి నవ వైకుంఠాన్ని చూడాలన్న ఏడున్నరేండ్ల ప్రజల కోరిక నెరవేరింది. యాదాద్రిపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి సోమవారం మధ్యాహ్నం నుంచి భక్తులకు పునర్దర్శనం ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో యాదగిరిగుట్టపై అడుగుపెట్టింది మొదలు, స్వామివారిని దర్శించుకొనేవరకు కండ్లముందు కనిపించే అణువణువూ ఆధ్యాత్మికతను, ఆహ్లాదాన్ని పంచుతుంది. పట్టణంలోకి అడుగుపెట్టగానే ఓం నమో నారసింహాయ మంత్రం ఒంట్లో భక్తిభావాన్ని పెంపొదిస్తుంది. అలా ఆలయంవైపు అడుగులు వేయగానే కొండపైనున్న సప్త గోపురాలు స్వర్గలోక వైకుంఠాన్ని చూసినంత ఆనందాన్ని కలిగిస్తాయి. ఇంకాస్త ముందుకు వెళ్లగానే వైకుంఠ ద్వారం భక్తులకు స్వాగతం పలుకుతుంది. ఇక్కడి నుంచి మెట్ల మార్గం ద్వారా ప్రధానాలయానికి చేరుకోవచ్చు. వాహనాల్లో వచ్చేవారు క్యూకాంప్లెక్స్‌ల ద్వారా దర్శనానికి రావాలి. ఆలయ పరిసరాల్లోకి చేరుకోగానే ఆలయంలోకి వెళ్లే క్యూలైన్ బంగారు వర్ణంలో మెరుస్తుంది.రస్సెత్తి చూస్తే శిఖరాయమానంగా కనిపించే గోపుర సౌందర్యం ఆలయానికి ప్రత్యేకత తెచ్చింది. నాలుగు దిశల్లో నాలుగు 55 అడుగుల ఎత్తున పంచతల గాలి గోపురాలు ఎత్తారు. ప్రచండ వాయుపీడనాన్ని తట్టుకొనేందుకు ఆ గోపురాలకు నేలనున్న ద్వారంతోపాటు పైన ఏర్పరిచిన గవాక్షాల సంఖ్యను బట్టి త్రితల, పంచతల, సప్తతల గోపురాలుగా మలిచారు. మిగిలిన ప్రాంతాల్లోని దేవాలయాల్లో గాలి గోపురాల బరువు ఎక్కువ కాకుండా ద్వారబంధంపై నుంచి ఇటుకలతో నిర్మాణాలు చేయడం సాధారణం. యాదాద్రి నారసింహుడి ఆలయ గోపురాల నిర్మాణంలో ఆకాశం అంచుల వరకు రాయినే వాడారు. ఆధునిక కాలంలో నిశ్చయంగా ఇదొక విశేష నిర్మాణం. రాయిని రాయిని అతికించేందుకు సంప్రదాయపద్ధతిలో బెల్లం, జనపనార, కరక్కాయ, కలబంద, సున్నం, నీటి మిశ్రమాన్ని వాడారు. రాళ్ల మధ్య పెద్ద అంతరాలను తొలగించడానికి సీసాన్ని కూడా వినియోగించారు. సిమెంట్ మచ్చుకైనా వాడలేదు.రెండేరెండు గోపురాలతో ఉన్న పాత దేవాలయం నేడు నలువైపుల ఏడు గోపురాలతో అలరారుతున్నది. అస్సాం నుంచి వచ్చిన కర్రదుంగ శ్రేష్ఠమైన వృక్ష స్కంధంతో నిటారుగా 34 అడుగుల సమున్నత దారు ధ్వజంతో ధ్వజస్తంభంగా గర్వంగా నిలుస్తున్నది. దీనికి ఏర్పాటైన వితర్థిక శిలా నిర్మితమే, శిల్పశోభితమే. పడమటి గోపురం సప్తతల గోపురంగా 72 అడుగులతో నిర్మితమైంది. నాలుగు దిశల్లో 55 అడుగులతో పంచతల, ఈశాన్యంవైపు 33 అడుగుల త్రితల గోపురాన్ని నిర్మించారు. మొత్తం సప్త గోపురాలతో సప్తగిరులవలె శోభిస్తున్నది. ఆలయంలో కుడ్యాలపై, స్తంభాలపై చెక్కిన దేవతామూర్తుల సంఖ్య 541. బాహ్యాంతః ప్రాకారాల కుడ్యాలపై, స్తంభాలపై రామాయణ, మహాభారత ఇతిహాసాల దృశ్యాలు చెక్కించారు. ఇది దక్షిణాది ఆలయాల సాదృశ్యంతో చేసింది. పడమటి మహాగోపురం బృహదీశ్వరాలయంలా సమస్త శిలానిర్మితం. ఎనిమిది వందల శిల్పుల సామూహిక స్వప్నం ఈ ఆలయం.నిలువెత్తుగా రెండంతస్తులుగా శిల్పశోభితమైన ముఖమంటపం, స్వామివారికి చక్రవర్తి సభా మంటపంలా శోభిల్లుతున్నది. నిజానికి ఈ నిర్మాణం కత్తిమీద సాము, రూపకర్తల (డిజైనర్స్) మేధకు పరీక్ష. కారణం స్వామివారి మూల విరాట్టును, దానికి ఆనుకొని ఉన్న కొండను, నృసింహుడు విరాజమానమైన గుహ పవిత్రతను కాపాడుతూ, సవరణలేవీ లేకుండా దాన్ని కలుపుకొని నిర్మాణాలు చేయడం కష్టకార్యం.

## ఏప్రిల్ 10వ తేదీ నుండి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు

శ్రీ సీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు : జెఈవో వీరబ్రహ్మం

కడప పురాతన ప్రాశస్త్యం గల ఒంటిమిట్ట శ్రీకోదండరామాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టిటిడి జెఈవో వీరబ్రహ్మం వెల్లడించారు. ఒంటిమిట్టలోని రాములవారి ఆలయం, కల్యాణవేదిక వద్ద జరుగుతున్న పనులను సోమవారం సివిఎస్వో గోపినాథ్ జెట్టి, కడప జిల్లా ప్రభుత్వ, పోలీస్ అధికారులతో కలిసి జెఈవో పరిశీలించారు. మెరుగైన ఏర్పాట్ల కోసం అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగంతో కలిసి కల్యాణవేదిక వద్ద జెఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకోదండరామాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 15వ తేదీన శ్రీసీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు మెరుగైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వేడుక కావడం, రాష్ట్ర గవర్నరు, ముఖ్యమంత్రివర్యులు విచ్చేయనుండడంతో జిల్లా యంత్రాంగంతో కలిసి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కల్యాణవేదిక వద్ద లక్ష మంది భక్తులు కూర్చునేందుకు వీలుగా షెల్టర్లు, చలువపందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాత్కాలిక మరుగుదొడ్లు, మొబైల్ మరుగుదొడ్లు, నీటి వసతి, పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలన్నారు.

# "స్పందన" ఫిర్యాదులను కాలపరిమితి లోగా పరిష్కరించాలి



**ఎట్టి పరిస్థితుల్లోనూ రీఓపెన్ కాకూడదు**

**ప్రజల నుంచి వచ్చిన వివిధ సమస్యల అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లోకి వెళ్లకూడదు**

**నాణ్యతతో పరిష్కరించాలి**

**గ్రామాలలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టండి**

**సంబంధిత అధికారులను ఆదేశించిన కర్నూలుజిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు**

కర్నూలు మార్చి 28( విభారె) :-స్పందన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి అర్జీ, ఫిర్యాదును కాలపరిమితిలోగా పరిష్కరించాలి....ఎట్టి పరిస్థితుల్లోనూ రీఓపెన్ కాకూడదని అధికారులను కర్నూలు జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వర రావు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు, జాయింట్ కలెక్టర్ (అభివృద్ధి) డాక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జాయింట్ కలెక్టర్ (రెవిన్యూ , రైతు భరోసా) రామ సుందర్ రెడ్డి, శ్రీశైలం ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ తమీమ్ అన్సారీయ, జాయింట్ కలెక్టర్ (ఆసరా , సంక్షేమం) ఎం.కె.వి శ్రీనివాసులు, డిఆర్ ఓ పుల్లయ్య, డిఎఫ్ఓ ప్రసన్న, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డిఆర్డిఎ పిడి వెంకటేశులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రాఘవేంద్ర, అనురాధ తదితరులు జిల్లా నలుమూలల ప్రజల నుండి వచ్చిన అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన ప్రజల్లో బలమైన నమ్మకాన్ని కలగజేసి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు. స్పందన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. బియాండ్ ఎస్ఎల్ఎలోకి ఏ ఒక్క అర్జీ వెళ్లకూడదని స్పష్టం చేశారు. రీ ఓపెన్ అయినా, బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. గడువు దాటి ఒక్క సమస్య కూడా ఉండకూడదన్నారు. పరిష్కారం గురించి అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పూర్తి వివరాలతో ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. డిపార్ట్మెంట్ వారీగా రీ ఓపెన్ పెండింగ్ రెవెన్యూ 30, పంచాయతి రాజ్ 10, జిఎస్ డబ్ల్యూయస్ 7 రీ ఓపెన్ పెండింగ్లో ఉన్నాయన్నారు. చితిబిష్ట ఎని ూఒం పెండింగ్లో రెవిన్యూ 401, పంచాయతీ రాజ్ 36, జిఎస్ డబ్ల్యూయస్ 29, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 3 ఉన్నాయని, రెవెన్యూ డిపార్ట్మెంట్ లో తహసిల్దార్ వారీగా రీ ఓపెన్ ఆస్పరి 3, ఆళ్లగడ్డ 3, రుద్రవరం 2, నంద్యాల 2, జూపాడుబంగ్లా 2, క్రిష్ణగిరి 2 ఉన్నాయన్నారు. జిఎస్ డబ్ల్యు ఎస్ ఎంపీడీవో వారిగా రీఓపెన్ కర్నూలు అర్బన్ 1, దేవనకొండ 1, ఓర్వకల్లు 1, బేతంచెర్ల 1, సిరివెళ్ల 1, మద్దికేర 1 రీ ఓపెన్ లో ఉన్నాయన్నారు. అదే విధంగా స్పందనలో వచ్చిన దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీ ఓపెన్ దరఖాస్తుల తదితర వివరాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి హైకోర్టుల్లో పెండింగ్ లో ఉన్న కేసులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హైకోర్టు ధిక్కార కేసులు నమోదు కాకుండా నోటీసులు అందిన వెంటనే పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఎంపీడీఓలు గ్రామాలలో త్రాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు త్రాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జగనన్న గోరుముద్ద పథకం ప్రభుత్వ పాఠశాలలో అమలు విషయంపై జిల్లా అధికారులు ఎవరెవరు విజిట్ చేశారో రిపోర్ట్ తెప్పించుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై బాధితులు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# నిర్భందాలతో హక్కులను ఇంకెంతకాలం అణిచేస్తారు?




**కార్మికుల దిక్కారస్వరమే నేటి సమ్మె:-యం డి ఆనంద్ బాబుకెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి**

మంత్రాలయం మార్చి 28( విభారె) :- దేశ వ్యాప్తంగా హక్కులకై జరుగుతున్న కార్మికుల దిక్కారస్వరమే నేటి సమ్మె అని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం డి ఆనంద్ బాబు తెలియజేసారు. సోమవారం మంత్రాలయం మండల కేంద్రం లో దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మె లో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుండి రాఘవేంద్ర స్వామి సర్కిల్, గుడి, పంచాయితీ కార్యాలయం వరకు కార్మిక ఐక్య ప్రదర్శనగా వెళ్లి అటు నుండి తిరిగి తహసిల్దార్ కార్యాలయం వరకు పెద్దపెట్టున నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పుష్పావతి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు విశాలాక్షి అధ్యక్షతన జరిగిన సమ్మె సభను ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం డి ఆనంద్ బాబు, సిఐటియు మండల కార్యదర్శి హెచ్ జయరాజు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాల కారణంగా బ్రిటిష్ కాలం నుండే పోరాడి హక్కులు గా సాధించుకున్న కార్మిక చట్టాలను కూలదోసి, నరక కూపాల లాంటి నాలుగు కోడ్ లుగా మార్చిందన్నారు. వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వున్న పది ట్రేడ్ యూనియన్ లు రెండు రోజులు సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. అలాంటి సమ్మెకు మద్దతుగా ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలు, అభ్యుదయ వాదులు సహితం సంఘీభావంగా సమ్మె కు మద్దతుగా నిలిచాయన్నారు. మంత్రాలయం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించేందుకు వీలులేదంటూ స్థానిక యస్ ఐ అడ్డగించే ప్రయత్నం చేశారు. నిర్భందానికి వ్యతిరేకంగా నినదించి తీరుతాం.. అవసరమనుకుంటే అరెస్టు చేయండంటూ పోలీస్ బృందం సమక్షంలోనే ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎఐటియుసి నాయకులు భాస్కర్, కెవిపిఎస్ మండల కార్యదర్శి బి అనిల్, డప్పు కళాకారుల సంఘం కార్యదర్శి వీరేష్ పాల్గొని మాట్లాడారు. రేపు మరింత పెద్దఎత్తున మానవహారం నిర్మిస్తామన్నారు.

# ముంపుకు గురవుతున్న పంట పొలాలు

**పట్టించుకోని అధికారులు**

బద్వేలు మార్చి 28( విభారె) బద్వేల్ నియోజకవర్గం ఆట్లూరుమండలం కమలకూరు సమీపంలో సగిలేరు పై సుమారు13 కోట్ల వ్యయం తో ఆనకట్ట నిర్మించి దాదాపు నాలుగు గ్రామపంచాయతీలకు చెందిన పంటపొలాలకు నీరు అందించాల్సి ఉంది. కానీ ఇంకా పూర్తిస్థాయిలో ఇరువైపులా రక్షణకట్ట నిర్మించక పోవడంతో పూర్తిస్థాయిలో నీరు నింపినప్పుడు రైతుల పంటపొలాల లోకి నీరుచేరి ముంపుకు గురవుతున్నాయని పుట్టాయపల్లి రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనకట్ట ఎగువ ప్రాంతంలో ఉన్న ,పుట్టాయపల్లి తదితర గ్రామాలకు చెందిన పొలాలకు నష్ట పరిహారం అందజేయకుండా, గత మూడు సంవత్సరాలుగా ఆనకట్టలో పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేయడంతో ,పంటపొలాలు ముంపుకు గురవుతున్నాయని, పుట్టాయపల్లె రైతులు, మహిళలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నష్ట పరిహారం ఇవ్వకుండా నీరుఎలా నిల్వ చేస్తారని అధికారులను నిలదీస్తే, భయపెడుతున్నారన్నారు. గత అక్టోబర్ నెలలో జరిగిన బద్వేల్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బిజెపి పార్టీకి ఓట్లు వేశారన్న కక్షతో ఆనకట్ట ఎగువన ఉన్న పంటపొలాలలోకి నీరు రాకుండా రక్షణ కట్టలను నిర్మించ లేదని ,అలాగే కొందరికి పరిహారం అందజేసి ,కొందరికి ఇవ్వక పోవడం ఏమిటని ఆయా గ్రామాల రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నో సార్లు ఇరిగేషన్ అధికారులకు మొరపెట్టుకున్నా కాలయాపన చేస్తున్నారన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బాధిత రైతులు పేర్కొంటున్నారు.

# కోతలతో విల విల

**రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం**

నంద్యాల మార్చి 28( విభారె) నంద్యాల టౌన్ మరియు రూరల్ మండలాల లో విద్యుత్ కోతలతో వినియోగదారులు బెంబేలెత్తి పోతున్నారు . గ్రామాల్లో ఇంక చెప్ప నవసరమే లేదు గంటల కొద్దీ కోతలు రాత్రి అప్రకటిత విద్యుత్ కోతలు విధించడంతో విల విల లాడుతున్నా వినియోగదారులు . అసలే వేసవి కాలం ఉక్క పోతతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఒక్కసారిగా రెండు నుంచి నాలుగు గంటల పాటు సరఫరా నిలిపి వేస్తున్నారు. ఇళ్లల్లో ఉండలేక బయటకు వద్దామంటే దోమల బాధతో బెంబేలెత్తి పోతున్న వినియోగదారులు . వినియోగం పెరగడం మరోవైపు ఉత్పత్తి లో స్వల్ప అంతరాయంతో అప్రకటిత విద్యుత్ కోతలకు కారణమయ్యాయని అధికారుల అంచనా . సాధారణంగా మే నెలలో అయ్యే వినియోగం మార్చిలో నే నమోదు అయినట్లు తెలుస్తోంది. గ్రుహ. వ్యాపార. వ్యవసాయ సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని కోవిడ్ అనంతరం ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. సినిమా థియేటర్లు. మాల్స్ . పూర్వపు స్థితికి వచ్చాయి. దీంతో విధ్యుత్ వినియోగం పెరిగిందని ఇది కూడా అప్రకటిత కోతలకు ఒక కారణం కావచ్చు . ఏప్రిల్. మే నెలల్లో ఇంకెంత వరకు వెళుతుందో అని అధికారులు ఆందోళన చెందుతున్నారు. మార్చి రెండో వారం నుంచి ఉక్క పోత ప్రారంభం కావటంతో ఏసీల వినియోగం ఒక్క సారిగా పెరిగిందని అంటున్నారు .

# పునీత్ సినిమా కోసం రాజకీయ పార్టీల ర్యాలీలు

కన్నడ స్టార్ హీరో పవర్ స్టార్ పునీత్ రాజ్ కుమార్ గత ఏడాది చివర్లో ఆకస్మికంగా గుండెపోటుతో మరణించడం తెలిసిందే. ఆయన మృతి చెంది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పునీత్ మృతి చెందాడంటే ఆయన అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదిలా వుంటే పునీత్ రాజ్ కుమార్ నటించిన చివరి చిత్రం 'జేమ్స్' ఆయన పుట్టిన రోజైన మార్చి 17న విడుదలైంది. అప్పూ చివరి చిత్రం కాడంతో ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో రిలీజ్ చేశారు.కన్నడ మాత్రమే కాకుండా తెలుగు తమిళ మలయాళ హిందీ భాషల్లో పాన్ ఇండియా వైడ్ గా ఈ మూవీని అత్యధిక థియేటర్లలో విడుదల చేశారు. అంతే కాకుండా ఈ మూవీ రిలీజ్ సందర్భంగా కర్ణాటక ఇండస్ట్రీ వర్గాలు ఎగ్జిబిటర్స్ ఈ మూవీ విడుదలైన మార్చి 17 నుంచి 22 వరకు మరే సినిమా ని విడుదల చేయకూడదని పూర్తిగా 'జేమ్స్' సినిమానే అన్ని థియేటర్లలోనూ ప్రదర్శించాలని తీర్మాణం చేసుకున్నారు. అనుకున్నట్టుగానే ఈ మూవీని మార్చి 17 నుంచి కర్ణాటకలోని దాదాపు అన్ని థియేటర్లలో ప్రదర్శిస్తూ అప్పూపై తమకున్న అభిమానాన్ని చాటుకుంటున్నారు.పునీత్ నటించిన చివరి చిత్రం కావడంతో




'జేమ్స్' ప్రదర్శిస్తున్న థియేటర్ల వద్ద జాతర వాతావరణం కనిపించింది. కొన్ని థియేటర్లయితే అభిమానుల కన్నీటి వరదతో తడిసి ముద్దయ్యాయి కూడా. అభిమాన హీరోని కడసారి వెండితెరపై చూస్తూ అభిమానులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో కర్ణాగకలోని చాలా వరకు థియేటర్లన్నీ అభిమానులు శోకాలతో దద్దరిల్లాయి. ఇందుకు సంబంధించిన పలు వీడియోలు నెట్టింట వైరల్ గా మారి ఎంత మందిని భావోద్వేగానికి లోనయ్యేలా చేశాయి.ఇదిలా వుంటే ఈ మూవీ విడుదలై నేటికి అంటే మార్చి 24కు వారం రోజులు పూర్తి కావస్తున్న నేపథ్యంలో కొన్ని థియేటర్లలో జనం తగ్గారు. దీంతో ఆయా థియేటర్లలో సినిమాని తీసేయాలని థియేటర్ల యాజమాన్యం యోచిస్తోంది. ఈ మూవీని తొలగించి అత్యధిక థియేటర్లలో ట్రిపుల్ ఆర్ ని ప్రదర్శించబోతున్నారు. ట్రిపుల్ ఆర్ ఈ శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతున్న విషయం తెలిసిందే. కర్నటకలో ఈ మూవీని అత్యధిక థియేటర్లలో రిలీజ్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ తెలుగు వెర్షన్ ని అత్యధిక థియేటర్లలో రిలీజ్ చేస్తున్నారని కన్నడ వెర్షన్ ని తక్కువ థియేట ర్లలో విడుదల చేస్తున్నా రని కర్ణాటకలో వివాదం మొదలైన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో 'జేమ్స్' చిత్రాన్ని చాలా వరకు థియేటర్లలో నుంచి తొలగిం చబోతు ఒడటంతో దీన్ని ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని అభిమానులు రాజకీయ వర్గాలు తీవ్రంగా సినిమాలకు తాము వ్యతిరేకం కాదని కానీ వేరే సినిమాల కోసం మా హీరో చిత్రాన్ని బలి చేయడం తగదని తీవ్రంగా హెచ్చిరిస్తున్నారట.

# రౌడీ ఫ్యాన్స్ అసంతృప్తి... అన్ని ఇన్ని అంటారు ఎక్కడ బాసూ?

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ చివరి చిత్రం వరల్డ్ ఫేమస్ లవర్ విడుదల అయ్యి రెండు సంవత్సరాలు దాటింది. ఇప్పటి వరకు ఆయన నుండి మరో సినిమా రాలేదు. మద్య లో కరోనా వల్ల సినిమాలు అందరు హీరోలు చేయలేదు. కాని చాలా మంది హీరోలు గత ఏడాది చివరి నుండే తమ సినిమాలను విడుదల చేసేందుకు సిద్దం అయ్యారు. కాని రౌడీ స్టార్ మాత్రం తన తదుపరి సినిమా లైగర్ ను ఈ ఏడాది ఆగస్టు లో విడుదల చేయబోతున్నాడు.

వరల్డ్ ఫేమస్ లవర్ కి లైగర్ సినిమాకు దాదాపుగా మూడు సంవత్సరాల గ్యాప్ ఉండబోతుంది. లైగర్ సినిమా కరోనా వల్ల ఆలస్యం అవుతుందని అభిమానులు సరి పెట్టుకున్నారు. కాని ఆయన తదుపరి సినిమాలు బ్యాక్ టు బ్యాక్ ప్రేక్షకుల ముందుకు వస్తాయని.. ఏడాదికి రెండు మూడు తీసుకు



వస్తాడని అంతా భావించారు. కాని ఆయన తీరు చూస్తుంటే తదుపరి సినిమాలు కూడా ఆలస్యం అవుతాయని అనిపిస్తుంది.ఇప్పటికే విజయ్ దేవరకొండ లైగర్ ను పూర్తి చేయగా అదే సినిమా దర్శకుడు పూరి జగన్నాద్ దర్శకత్వంలో మరో సినిమాను విజయ్ దేవరకొండ చేయబోతున్నాడు. పూరి జగన్నాద్ ఇప్పటికే శివ నిర్వాన దర్శకత్వంలో ఒక సినిమాను చేసేందుక కమిట్ అయ్యాడు. ఆ సినిమా చాలా కాలం క్రితమే పట్టాలు ఎక్కాల్సి ఉన్నా కూడా వాయిదాలు పడుతూ వచ్చింది. ఇక సుకుమార్ మరియు విజయ్ దేవరకొండల కాంబోలో కూడా ఒక సినిమా అధికారిక ప్రకటన వచ్చింది.పుష్ప 2 సినిమా ఆలస్యం అవ్వబోతున్న నేపథ్యం లో విజయ్ దేవరకొండ.. సుకుమార్ ల సినిమా ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ గ్యాప్ లో శివ నిర్వాన దర్శకత్వంలో విజయ్ సినిమా పట్టాలు ఎక్కే అవకాశం ఉందంటున్నారు. మరో వైపు కొరటాల శివ దర్శకత్వంలో కూడా విజయ్ దేవరకొండ ఒక సినిమా చేయబోతున్నట్లుగా వార్తలు వచ్చాయి. ఆ విషయమై క్లారిటీ రాలేదు కాని ఇద్దరి కాంబో దాదాపుగా కన్ఫర్మ్ అయ్యింది.విజయ్.. కొరటాల శివ కాంబో మూవీ ఎప్పుడు ఉంటుంది అనే విషయం లో క్లారిటీ రావాల్సి ఉంది. ఇక తాజాగా విజయ్ దేవరకొండ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఒక సినిమా పట్టాలు ఎక్కబోతుంది అంటూ వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై కూడా అధికారికంగా ప్రకటన రాలేదు. కాని చర్చలు అయితే జరుగుతున్నాయి అంటూ సమాచారం అందుతోంది.ఇన్ని సినిమాలకు కమిట్ అయిన విజయ్ దేవరకొండ సినిమాలు ఏ ఒక్కటి కూడా ఇప్పుడు పట్టాలు ఎక్కలేదు. ఈ ఏడాది లైగర్ మినహా మరే సినిమా వచ్చే దాఖలాలు కనిపించడం లేదు. దాంతో అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సరైన ప్లానింగ్ తో రౌడీ స్టార్ వ్యవహరించడం లేదని.. ఇన్ని అన్ని సినిమాలు ఆయన నుండి వస్తాయని అంటున్నారు కాని అవి ఎక్కడ... ఎప్పుడు వస్తాయి అనేది తెలియడం లేదంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

# మహేష్ ఫ్యాన్స్ ని వెంటాడుతున్న సెంటిమెంట్ భయం



సినిమా ఇండస్ట్రీ సెంటిమెంట్ లకు పెద్ద పీట వేస్తుంటుందన్నది తెలిసింది. సినిమా ప్రారంభానికి ఫస్ట్ లుక్ రిలీజ్కి టీజర్ ట్రైలర్ రిలీజ్ లకి ముహూర్తలు చూసుకుని మరీ రిలీజ్ చేస్తుంటారు. అంతే కాకుండా పేర్లని కూడా సంఖ్యా శాస్త్రం ప్రకారం మార్చుకుంటుంటారు. అలా మార్చుకుంటే కెరీర్ మారుతుందని. ఉదాహరణకు రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ పేరుని 'అర్జున్ రెడ్డి' సినిమా టైటిల్స్ లో విజయ్ సాయి దేవరకొండ అని వేశారు. ఆ తరువాత నుంచి ఆయన పేరులో వున్న సాయి అనే పదాన్ని తొలగించి విజయ్ దేవరకొండ అని వేస్తున్నారు.ఇంతలా సెంటిమెంట్ లకు పెద్ద పీట వేసే ఇండస్ట్రీలో ప్రతీదాన్నీ సెంటిమెంట్ తో చూస్తుంటారు. పైకి ఏమీ లేదని చెబుతున్నా.. హీరోలకు అడ్వాన్స్ ఇచ్చే సమయాన్ని కూడా సెంటిమెంట్ గా భావించి అడ్వాన్స్ ఇస్తుంటారట. మరీ ఇంతలా సెంటమెంట్ లు ఫాలో అవుతున్న ఇండస్ట్రీలో మహేష్ ని మహేష్ అభిమానుల్ని ఓ సెంటిమెంట్ కలవరపెడుతోంది. సినిమా ప్రారంభం దగ్గరి నుంచి సెంటిమెంట్ లని ఫాలో అవుతుంటారు సూపర్ స్టార్ మహేష్.ఆయన తన సినిమా ఓపెనింగ్ కి ఏనాడూ రాలేదు. అది ఆయన సెంటిమెంట్. ఆయన రాకుండా మహేష్ వైఫ్ నమ్రత ఓపెనింగ్ సెర్మనీల్లో పాల్గొంటూ వుంటుంది. ఇటీవల త్రివిక్రమ్ మూవీ ఓపెనింగ్ కి కూడా సెంటిమెంట్ కారణంగానే మహేష్ కనిపించలేదు. అంతా సెటిమెంట్ లని నమ్మే మహేష్ కు మహేష్ అభిమానులకు మే నెల అంటే టెర్రర్. కారణం ఈ నెలలో విడుదలైన మహేష్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ వైఫల్యాలని చవి చూశాయి.2016 మే 20న విడుదలైన 'బ్రహ్మోత్సవం' ఎలాంటి ఫలితాన్నిఅందించిందో అందరికి తెలిసిందే. శ్రీకాంత్ అడ్డాల తెరకెక్కించిన ఈ మూవీని పీవీపీ సినిమా బ్యానర్ పై పీవీపీ నిర్మించారు. మహేష్ కెరీర్ లోనే అత్యంత డిజాస్టర్ గా ఈ మూవీని విమర్శకులు అభివర్ణించారు. 2003లో జనవరికి 'ఒక్కడు' వంటి బ్లాక్ బస్టర్ హిట్ ని సొంతం చేసుకున్న మహేష్ అదే ఇయర్ మే 23న 'నిజం'తో భారీ ఫ్లాప్ ని సొంతం చేసుకున్నారు.ఇక 2004 మే 14న విడుదలైన 'నాని' కూడా ఇదే ఫలితాన్ని అందించింది. 'ఖుషీ' వంటి బ్లాక్ బస్టర్ ని అందించిన ఎ.ఎ.జె. సూర్య ఈ మూవీతో భారీ డిజాస్టర్ ని సంతం చేసుకున్నాడు.అయితే గత కొంత కాలంగా మహేష్ ని పట్టిపీడిస్తున్న ఈ సెంటిమెంట్ ని 'మహర్షి' మూవీ బ్రేక్ చేసింది. వంశీ పైడిపల్లి డైరెక్షన్ లో మహేష్ చేసిన ఈ మూవీ 2019 మే 9న విడుదలై మంచి విజయాన్ని సాధించింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం భారీ వసూళ్లని రాబట్టి 100 కోట్ల క్లబ్ లో చేరింది.ఇప్పుడు మరోసారి మే నెలలో మహేష్ నటించిన మరో చిత్రం 'సర్కారు వారి పాట' రాబోతోంది. పరశురామ్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రాన్ని మే 12న వరల్డ్ వైడ్ గా విడుదల చేస్తున్నారు. ఈ మూవీ 'మహర్షి' తరహాలోనే సెంటిమెంట్ ని బ్రేక్ చేసి బ్లాక్ బస్టర్ హిట్ గా నిలవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

# నేను మీ కెప్టెన్ హార్దిక్ పాండ్యా.. ధోనితో పోటీ పడతా.. మాట ఇస్తున్నా! ఇక..




: “లేడీస్ అండ్ జెంటిల్మెన్.. నేను మీ కెప్టెన్... కెప్టెన్ హార్దిక్ పాండ్యాను మాట్లాడుతున్నాను. ఇదంతా నిజంగా చాలా కొత్తగా ఉంది. కానీ.. ఒక్క మాట చెప్పదలచుకున్నా... నేను ఎక్కడి వచ్చానో చెప్పనక్కర్లేదు.. ఆ విషయం మీకు తెలుసనే అనుకుంటాను. అయితే, మిమ్మల్ని ఎక్కడి దాకా తీసుకువెళ్లగలనో మాత్రం చెప్పగలను. విజయతీరాలకు చేర్చి శిఖరంపై నిలబెడతాను. ఇదొక మధురమైన, ఉన్నతమైన ఆట. ఈ ఆటలో నా సోదరుడు(ఎంఎస్ ధోని) తన అసాధారణ ప్రతిభతో ఓ గీత గీశాడు. నేను ఆయనను స్పూర్తిగా తీసుకుని ఆయనతోనే పోటీ పడేందుకు సిద్ధంగా ఉన్నాను. నా హీరో(సచిన్ టెండుల్కర్) స్ఫూర్తిదాయక మాటలు వింటూ ఇక్కడిదాకా వచ్చాను. ప్రయాణంలో నేను నా తోబట్టువుతో పోటీపడాల్సి ఉంటుంది. నా సన్నిహితులతో తలపడాల్సి వస్తుంది. ఈ జర్నీలో ఎన్నో ఎత్తుపల్లాలు. కానీ ఒక్కమాట. నేను నిషేధం ఎదుర్కొన్నాను.. గాయం కారణంగా జాతీయ జట్టుకు దూరమయ్యాను. ఇంకా ఎన్నెన్నో చేదు అనుభవాలు ఎదుర్కొన్నాను. అయినా, సరే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతాను. నా జట్టును అలాగే తీర్చిదిద్దుతాను. కాబట్టి మా ఈ సాహసోపేతమైన ప్రయాణాన్ని వీక్షించడానికి మీరు సిద్ధంగా ఉండండి” అంటూ ఐపీఎల్ కొత్త జట్టు గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా అభిమానులను ఉద్దేశించి భావోద్వేగ ప్రసంగం చేశాడు. తన జీవితం, క్రికెట్ కెరీర్లోని ఒడిదుడుకులు, చేదు అనుభవాలను గుర్తు చేసుకుంటూ.. వాటిని అధిగమించడంలో తనకు సహాయపడిన వ్యక్తులను గుర్తు చేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యాడు. అభిమానులకు కచ్చితంగా వినోదం పంచుతామని, అంచనాలు అందుకుంటామని పేర్కొన్నాడు. ఇందుకు సంబంధించిన వీడియోను గుజరాత్ టైటాన్స్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది. కాగా మార్చి 28న మరో కొత్త జట్టు లక్నో సూపర్జెయింట్స్తో గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్లో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఇక ఈ జట్టుకు హార్దిక్ పాండ్యా కెప్టెన్ కాగా.. అఫ్గనిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ వైస్ కెప్టెన్గా వ్యవహరించనున్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**